RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




హైదరాబాద్ 27 అక్టోంబర్ 2026 మంగళవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:127

## తుమ్మిడిహెట్టి ఎత్తు పెంపుపై రేవంత్, ఫడ్నవీస్ కీలక భేటీ..

## మహారాష్ట్ర నుంచి సానుకూల స్పందన



ముంబై, అక్టోబరు 26, (న్యూస్ పల్స్) తెలంగాణకు అత్యంత కీలకమైన తుమ్మిడిహెట్టి బ్యారేజీకి సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో ముంబైలో సమావేశమయ్యారు. ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ 152 మీటర్ల వరకు చేపడితే తమకు ప్రయోజనమని ఫడ్నవీస్‌కు తెలిపారు. బ్యారేజీ ఎత్తు పెంపు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, ఇతర సాంకేతిక అంశాలపై ఇరు రాష్ట్రాల నేతలు చర్చించారు. తెలంగాణ ప్రతిపాదనపై దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందిస్తూ.. ఈ విషయంపై అధికారుల కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. అధ్యయనం చేసిన తరువాత తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. తెలంగాణతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని.. ఆదిలాబాద్ ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. తన అమ్మమ్మ తెలుగు మాట్లాడతారని ఆయన ప్రస్తావించారు. ముంబైలోని సహ్యాద్రి ప్రభుత్వ అతిథి గృహంలో జరిగిన ఈ భేటీలో తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఇరు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజెంటేషన్ ద్వారా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, సంస్కృతి, గిరిజనుల జీవన పరిస్థితులు, ఆర్థిక వెనుకబాటుతనాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సుసంపన్నమైన చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉన్నప్పటికీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిలో వెనుకబడిపోయిందన్నారు. గిరిజనులు, ఆదివాసీలకు అభివృద్ధి ఫలాలు అందలేదని.. ఆర్థిక అవకాశాలు లేకపోవడం, వెనుకబాటుతనం కారణంగా గతంలో నక్సలిజం వంటి సమస్యలను వివరించారు. ఆ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు 1975 అక్టోబర్ 6న అప్పటి సీఎం జలగం వెంగళరావు, ఎస్ బీ చవాన్ మధ్య కుదిరిన ఒప్పందం నుంచి.. వివిధ దశల్లో జరుగుతున్న ప్రయత్నాలను ప్రస్తావించారు. 5 దశాబ్దాలుగా అనేక ప్రతిపాదనలు, చర్చలు జరిగినా ఆశించిన పురోగతి సాధించలేకపోయామన్నారు. 2016లో తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 148 మీటర్లుగా నిర్ణయిస్తూ ఒప్పందం కుదిరిందని తెలిపారు.

మిగతా 2 లో

## అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు.

**రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**గ్రామాల్లో అన్ని మౌళిక సదుపాయాలు కల్పిస్తాం**

**కూసుమంచి మండలం గోరీలపాడు తండా నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన మంత్రి**

ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 26:రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

మిగతా 3 లో



## నేలకొండపల్లి బౌద్ధ స్తూపానికి పూర్వ వైభవం

## రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



వార్తా 2 లో

**గొప్ప బౌద్ధ క్షేత్రంగా తీర్చిదిద్దుతాం నేలకొండపల్లి బౌద్ధ స్తూప అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి**



ప్రజాబలం

27 అక్టోబర్ 2026 మంగళవారం

# సోనియాగాంధీ బయోగ్రాఫీ వివాదాలు

కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు.. రాజ్యసభ సభ్యురాలు సోనియాగాంధీ తన సుదీర్ఘ రాజకీయ చరిత్ర.. జీవిత ప్రయాణంలో అనుభవాలను ఆవిష్కరించారు. ఈ నేపథ్యంలో ఆమె ఒక ఆత్మ కథ కూడా రాశారు. దానికి బిలాంగింగ్ జర్నీ ఆఫ్ లవ్ పేరు పెట్టారు. ఈ పుస్తకాన్ని వచ్చేనెల 10వ తేదీన విడుదల చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో సోనియాగాంధీ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో ఒక పోస్ట్ చేశారు.కేం బ్రిడ్జిలోని ఒక చిన్న గ్రీక్ రెస్టారెంట్లో సోనియాగాంధీ, రాజీవ్ గాంధీకి మధ్య ప్రేమ ప్రయాణం మొదలైంది. నాడు వారిద్దరు అక్కడ తరచుగా కలుసుకునేవారు. ఎన్నో తీపి జ్ఞాపకాలు.. ఎన్నో మధురమైన స్మృతులు.. నవ్వులు.. కలిసి ఆరగించిన పదార్థాలు.. వీటికి సంబంధించిన పూర్తి వివరాలను సోనియా గాంధీ తన ఆత్మకథలో ప్రస్తావించారు. ఒక ఉద్యోగ భరితమైన వీడియోను.. అప్పటి ఫోటోలను సోనియా బయట పెట్టారు.ఈ పుస్తకాన్ని దాదాపు 554 పేజీలతో రూపొందించారు సోనియాగాంధీ.. మనదేశంలో హార్పర్ కాలిన్స్ ఇండియా.. ఇంటర్నేషనల్ లెవెల్ లో ప్రఖ్యాతల్ఫ్రేడ్ ఎ. నాఫ్ పబ్లిక్ సంస్థలు ఈ పుస్తకాన్ని ప్రచురించాయి. సెకండ్ వరల్డ్ వార్ తర్వాత ఇటలీలో సోనియాగాంధీ బాల్యం మొదలైంది. 1965 లో కేంద్రంలో విద్యార్థిగా ఆమె చేరినప్పుడు రాజీవ్ గాంధీతో పరిచయం ఏర్పడింది. అది కాస్త ప్రేమకు దారితీసింది. అనంతరం వారిద్దరు తమ బంధాన్ని పెళ్లితో మరింత పదిలం చేసుకున్నారు. రాజీవ్ గాంధీతో ఉన్న స్మృతులను.. జ్ఞాపకాలను ఎంతో భావోద్వేగమైన విధానంలో సోనియాగాంధీ ఈ పుస్తకంలో పొందుపరిచారు.. ముఖ్యంగా భారతీయ సంస్కృతికి ఎటువంటి సంబంధం లేకుండా.. ఒక విదేశీ యువతీ దేశంలో అడుగుపెట్టడం.. నెహ్రూ.. గాంధీ కుటుంబాలలో కోడలిగా.. ముఖ్యమైన వ్యక్తిగా ఇమిడిపోవడం వంటి విషయాలను ఆమె అక్షరీకరణ చేశారు.కేవలం తమ ప్రేమకు సంబంధించిన వ్యవహారాలను మాత్రమే ఇందులో సోనియాగాంధీ ప్రస్తావించలేదు. దేశ స్వాతంత్ర ఉద్యమంలో నెహ్రూ కుటుంబం పడిన ఇబ్బందులు.. గాంధీ కుటుంబం చేసిన త్యాగాలు.. దేశ రాజకీయాలలో ఈ రెండు కుటుంబాలు పోషించిన పాత్ర వంటి వాటిపై ఈ పుస్తకంలో సోనియాగాంధీ వివరించారు. 1984లో ఇందిరాగాంధీ హత్యకు గురి కావడం.. 1991లో రాజీవ్ గాంధీ దుర్మరణం చెందడం వంటి దారుణాలు జరిగినప్పుడు తాను ఎదుర్కొన్న విషాదం.. అనుభవించిన మానసిక వేదనను సోనియాగాంధీ ఈ పుస్తకంలో ప్రస్తావించారు. తన కళ్ళ ముందు రక్త సంబంధాలు విచ్ఛిన్నం కావడం.. పిల్లలు రాహుల్.. ప్రియాంకను చూసుకుంటూ.. ఒంటరిగా ఆమె సాగించిన రాజకీయ ప్రయాణాన్ని ఇందులో ప్రస్తావించినట్టు తెలుస్తోంది.సోనియాగాంధీ కాంగ్రెస్ పార్టీకి అత్యధిక కాలం అధ్యక్షురాలిగా పని చేశారు. 1990 చివరి కాలంలో రాజకీయాల్లోకి సోనియా గాంధీ బలవంతంగా వచ్చారు. ముఖ్యంగా 2004లో యూపీఏ అధికారంలోకి వచ్చినప్పుడు.. ప్రధానమంత్రి పదవిని చేపట్టే అవకాశం ఉన్నప్పటికీ.. దానిని తిరస్కరించిన విధానం.. మన్మోహన్ సింగ్ ఎంపిక.. రెండు పర్యాయాలు కేంద్రంలోకి అధికారంలోకి రావడం.. కీలకమైన సమాచార హక్కు చట్టం.. ఉపాధి వంటి పథకాలను అమలు చేయడం మట్టి విషయాలను సోనియాగాంధీ ఇందులో ప్రస్తావించారు.ఇక ఈ పుస్తకం ప్రచురణకు ముందు పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ తో వచ్చిన వివాదాలు.. మధ్యలోకి హార్పర్ కాలిన్స్ సంస్థ రావడం.. వంటి పరిణామాలు ఈ పుస్తకానికి మరింత ప్రచారం తీసుకొచ్చాయి..సోనియా గాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్.. ఏ జర్నీ ఆఫ్ లవ్' నవంబర్ 10వ తేదీన విడుదల కానుంది.. అయితే బుక్ రిలీజ్ అయిన తర్వాత దేశ రాజకీయాలలో ఎటువంటి మార్పులు చోటు చేసుకోబోతాయో చూడాల్సి ఉంది.ఇంతలోనే వారందరికీ షాక్ ఇస్తూ భారత్‌లో తాము ఆ గ్రంథాన్ని ప్రచురించటం లేదని 'పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా' సంస్థ శుక్రవారం ప్రకటించింది. పుస్తకంలో కొన్నిచోట్ల తాము సూచించిన మార్పులు చేసేందుకు రచయిత (సోనియాగాంధీ) అంగీకరించలేదని, అందువల్లే భారత్‌లో ఆ గ్రంథం ప్రచురణ బాధ్యతల నుంచి తప్పుకున్నట్లు వెల్లడించింది. 'గ్రంథంలోని అంశాల వాస్తవికతను పరిశీలించి రచయితకు పలు సూచనలు ఇవ్వటం పబ్లిషర్‌గా మా బాధ్యత. ప్రచురణ ప్రక్రియలో ఇది సాధారణ అంశం' అని పేర్కొందిపెంగ్విన్ సంస్థ ప్రకటనపై కాంగ్రెస్ పార్టీ భగ్గుమంది. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, భావప్రకటనా స్వేచ్ఛను ఆ సంస్థ చంపేసిందని కాంగ్రెస్ నేత, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ మండిపడ్డారు. 'సోనియాగాంధీ ఆత్మకథ గ్రంథాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచురించేందుకు పెంగ్విన్ రాండమ్ కంపెనీ సిద్ధంగా ఉంది. కానీ, భారత్‌లో దాని అనుబంధ సంస్థ అయిన పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా మాత్రం ఆ గ్రంథంలో మార్పులు చేయాలని కోరుతోంది. అందుకు కారణమేంటి? ఆ సంస్థ ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గింది? త్యాగం, నిబద్ధతకు సోనియాగాంధీ జీవితం ఉదాహరణ. దేశానికి ఆమె అసాధారణ సేవ చేశారు. అలాంటి గొప్ప నాయకురాలి ఆత్మకథను రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ప్రచురించకుండా తప్పుకోవటం భావప్రకటనా స్వేచ్ఛను హత్యచేయటమే. నరేంద్రమోదీ పాలనలో భారత భూభాగాన్ని చైనా ఆక్రమించటం, మోదీ పాలన, ఆరెస్సెస్ కు సంబంధించి ఎడిటోరియల్‌లోని అంశాలను తొలగించాలని పెంగ్విన్ ఇండియా కోరింది. ఆ అంశాలను తొలగించేలా చూడాలని మోదీ ప్రభుత్వం పబ్లిషర్‌పై ఒత్తిడి తెచ్చిందా?' అని గెహ్లోత్ ప్రశ్నించారు. పెంగ్విన్ సంస్థ నిర్ణయం ఆందోళనకరమని మధ్యప్రదేశ్ మాజీ సీఎం కమల్‌నాథ్ అన్నారు. ఆరెస్సె?సపై గ్రంథాలు ప్రచురించిన పెంగ్విన్ సంస్థ.. సోనియా ఆత్మకథ ప్రచురణ నుంచి తప్పుకోవటానికి చూపిన కారణం బలంగా లేదని లోక్‌సభలో కాంగ్రెస్ ఉపనేత గౌరవ్ గొగోయ్ విమర్శించారు. కాంగ్రెస్ విమర్శలను బీజేపీ తిప్పికొట్టింది. సోనియాగాంధీ తన జ్ఞాపకాలు, అనుభవాలను పుస్తక రూపంలో తెస్తున్నప్పుడు.. వాటిలో కొన్ని కల్పనలు కూడా ఉండవచ్చు కదా? అని బీజేపీ నేత అమిత్ మాలవీయ ప్రశ్నించారు. వాటిని సరిచూసుకోవాలని పబ్లిషర్ చెప్పటంలో తప్పేముందని నిలదీశారు.

## తుమ్మిడిహెట్టి ఎత్తు పెంపుపై రేవంత్, ఫడ్నవీస్ కీలక భేటీ..

# మహారాష్ట్ర నుంచి సానుకూల స్పందన

మొదటి పేజీ తరువాయి

ఈ ఎత్తుతో బ్యారేజీ నిర్మిస్తే తెలంగాణ ప్రాంత తాగు, సాగునీటి అవసరాలు పూర్తిస్థాయిలో తీరవని మంత్రి ఉత్తమ్ వివరించారు. ప్రస్తుత విద్యుత్ అవసరాలు, ఇంధన వ్యయం, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులను పరిగణనలోకి తీసుకోవాలని.. ప్రాజెక్టు నిర్వహణ వ్యయం సైతం ముఖ్యమైన అంశమన్నారు. అందుకే గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో నిర్మించడమే తమకు ప్రత్యామ్నాయమని వివరించారు. సాంకేతిక, నిర్వహణ, ఆర్థిక అంశాల పరంగా ఈ ప్రతిపాదనకు ఉన్న ప్రాధాన్యాన్ని ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. మహారాష్ట్రలో అమల్లో ఉన్న భూసేకరణ నిబంధనలు, ఆ రాష్ట్ర పరిహార విధానం ప్రకారం భూములు కోల్పోయే రైతులకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు.తెలంగాణ – మహారాష్ట్ర మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. పూర్వ హైదరాబాద్ సంస్థానంతో 2 రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలకు ఉన్న అనుబంధాన్ని ప్రస్తావించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధానంగా వెనుకబడిన అటవీ ప్రాంతమన్నారు. అక్కడి గిరిజనులు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ దృష్టికి తీసుకెళ్లారు. కొమురం భీమ్ సాగించిన జల్, జంగిల్, జమీన్ పోరాటాన్ని ప్రత్యేకంగా గుర్తుచేశారు. ఆ పోరాట కాలం నుంచి ఆదిలాబాద్ ప్రజలు సాగు, తాగునీటి సదుపాయాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు.దశాబ్దాలుగా వారి ఆకాంక్షలు నెరవేరలేదని, ఆ గిరిజనులు, ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందన్నారు. వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు 2 రాష్ట్రాలు కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని కోరారు. దేశ రక్షణ, జాతీయ వ్యూహాత్మక ప్రయోజనాల పరంగా ఆదిలాబాద్ కు ఉన్న ప్రాధాన్యతను రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రక్షణ, పౌర విమానాశ్రయ సదుపాయం అందుబాటులోకి వస్తే ఈ ప్రాంతం అభివృద్ధికి ఊతమిస్తుందని తెలిపారు.మహారాష్ట్రలోని సరిహద్దు ప్రాంతాలకూ ప్రయోజనం కలుగుతుందన్నారు. విమానాశ్రయంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో రవాణా సదుపాయాలతో పాటు ఆర్థిక కార్యకలాపాలు, అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదని.. 2 రాష్ట్రాలను భౌతికంగా అనుసంధానించే వారధిగా నిలుస్తుందన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, గిరిజనుల సంక్షేమానికి రెండు రాష్ట్రాల సహకారం ఉండాలన్నారు. పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సహకరించాలని ఫడ్నవీస్ కి విజ్ఞప్తి చేశారు.తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును పెంచాలన్న తెలంగాణ అభ్యర్థనను మరోసారి పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ తెలిపారు. తుది నిర్ణయానికి వచ్చే ముందు పలు అంశాలపై అధ్యయనం చేయాలన్నారు. సాంకేతిక, పర్యావరణ, పరిపాలనాపరమైన అంశాలను పరిశీలించాలని ఫడ్నవీస్ స్పష్టం చేశారు. మహారాష్ట్రకు, తమ ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకపోతే 148 మీటర్ల ఎత్తు ఒప్పందాన్ని మరోసారి పరిశీలించేందుకు అభ్యంతరం లేదన్నారు. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు విషయంలో వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారుస్నేహభావం, సోదరభావంతో మంచి పొరుగు రాష్ట్రాలుగా ముందుకు వెళ్లాలని ఫడ్నవీస్ అభిప్రాయపడ్డారు. గతంలో ఇతర రాష్ట్రాలతో మహారాష్ట్ర పలు అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించుకుందని గుర్తుచేశారు. పరస్పరం చర్చలు, సహకారంతో ఆయా సమస్యలకు పరిష్కారం ఉందని తెలిపారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు విషయంలో కేంద్ర జల సంఘం తన పరిధిలో అవసరమైన అధ్యయనాలు చేపడుతుందన్నారు. సాంకేతిక పరిశీలనలు అవసరం అన్నారు. ఈలోపు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యతపై కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయాలన్నారు. మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలను పరిశీలించాలని సూచించారు. పరిహారంతో పాటు, ఇతర సాంకేతిక అంశాలను కూడా అధ్యయనం చేయాలని చెప్పారు.ముంపు ప్రభావం, ప్రభావిత భూముల విస్తీర్ణంపై 2 రాష్ట్రాల అంచనాలను పరిశీలించాలని ఫడ్నవీస్ సూచించారు. ఇరు రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అవసరమైతే ప్రత్యామ్నాయాలను అధ్యయనం చేయాలన్నారు. తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాల అధికారులు, సాంకేతిక నిపుణులు సంప్రదింపులు జరపాలని సూచించారు. తదుపరి సమావేశాల నిర్వహణ, కాలపరిమితులను నిర్ణయించాలని సూచించారు. బ్యారేజీ ప్రాజెక్టుపై ముందుకు వెళ్లేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు.దేశంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఇరువురు సీఎంలు పునరుద్ఘాటించారు. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఆదిలాబాద్ గిరిజనులు, ఆదివాసీలు, అభివృద్ధి అవకాశాలు అందని వర్గాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరాన్ని ఫడ్నవీస్ పేర్కొన్నారు

**అధ్యయనానికి అధికారుల కమిటీ**

బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలు, పరిహారం వంటి అంశాలపై రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఫడ్నవీస్ ప్రతిపాదించారు. అవసరమైతే ప్రత్యామ్నాయాలపైనా అధ్యయనం చేయాలని సూచించారు. కేంద్ర జల సంఘం కూడా తన పరిధిలో సాంకేతిక అంశాలను పరిశీలించనుంది.

**రెండు లక్షల ఎకరాలకు సాగునీరు**

తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం. గిరిజన, అటవీ ప్రాంతాల్లో సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు ఈ ప్రాజెక్టు కీలకమని రేవంత్‌రెడ్డి వివరించారు. బ్యారేజీ వల్ల మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు అక్కడి నిబంధనల ప్రకారం పూర్తి పరిహారం చెల్లిస్తామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. బ్యారేజీ ఎత్తు ఖరారైతే తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించే మార్గం రూపకల్పన, భూసేకరణ వంటి పనులను వేగవంతం చేయాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. చర్చలు సానుకూలంగా సాగినా.. నిర్మాణానికి తుది అనుమతి లభించిందని ఇప్పుడే చెప్పలేం. అధికారుల అధ్యయనం, తదుపరి చర్చల తర్వాతే దీనిపై స్పష్టత రానుంది.

# నేలకొండపల్లి బౌద్ధ స్తూపానికి పూర్వ వైభవం

## రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 26:**పాలేరు నియోజకవర్గ పరిధిలోని నేలకొండపల్లిలో ఉన్న 3వ శతాబ్దానికి చెందిన చారిత్రక బౌద్ధ స్తూపాన్ని, పరిసర ప్రాంతాలను అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం నేలకొండపల్లిలో పర్యాటక సదుపాయాల కల్పన, బౌద్ధ స్థల సంరక్షణ/పునరుద్ధరణ పనులకు మంత్రి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 3 వ శతాబ్దానికి చెందిన బౌద్ధ స్థూపాన్ని సుమారు 50–55 సంవత్సరాల క్రితం నేలకొండపల్లి గ్రామంలో గుర్తించారని, దేశంలోనే అత్యంత పెద్ద బౌద్ధ స్తూపాల్లో ఒకటిగా నిలిచిందని తెలిపారు. గత ప్రభుత్వాలు ఈ ప్రాంత అభివృద్ధిని ప్రారంభించినప్పటికీ పనులు పూర్తి చేయలేకపోయాయని అన్నారు. స్తూపం చుట్టూ ఉన్న ఒకటిన్నర కిలోమీటరు పరిధిలో పురావస్తు శాఖ అధికారులు గతంలో జరిపిన తవ్వకాల్లో ఎన్నో పురాతన వస్తువులు లభ్యమయ్యాయని, వాటిని భద్రపరిచేందుకు స్థానికంగా వసతులు లేకపోవడంతో హైదరాబాద్ మ్యూజియంలో ఉంచారని తెలిపారు.

ప్రపంచవ్యాప్తంగా వచ్చిన బౌద్ధ మతస్థులు, స్థానికుల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుని, రాబోయే రోజుల్లో బౌద్ధ కట్టడాలపై అవగాహన ఉన్న ప్రముఖ నిపుణులను, అధికారులను ఇక్కడికి ఆహ్వానించి విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామని అన్నారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రదేశాన్ని అభివృద్ధి చేయడానికి ఎంత ఖర్చయినా వెనుకాడబోమని, బౌద్ధులకు ప్రత్యేకాకర్షణగా నిలిచేలా రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు. రాబోయే రోజుల్లో ఇట్టి ప్రదేశాన్ని గొప్ప పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర హెరిటేజ్ శాఖ డైరెక్టర్ కుతాడి అర్జున్ రావు, హెరిటేజ్ శాఖ ఉప సంచాలకులు నాగరాజు, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, తహశీల్దార్ రాంప్రసాద్, కన్సల్టెంట్ శ్రీనివాస్, టూరిజం డీఈ రామకృష్ణ, జిల్లా టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి, స్థానిక సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# స్టాక్ మార్కెట్లలో కొనుగోళ్ల జోరు.. సెన్సెక్స్ 482 పాయింట్లు జంప్

ముంబై, అక్టోబరు 26,దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం ఒడుదొడుకుల మధ్య లాభాలతో ముగిశాయి. ఉదయం ట్రేడింగ్‌లో కొంత బలహీనత కనిపించినా, చివర్లో కొనుగోళ్లు పెరగడంతో సూచీలు పుంజుకున్నాయి. ముఖ్యంగా మెటల్, ఫార్మా, హెల్త్‌కేర్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలోనూ ఇన్వెస్టర్లు ఆసక్తి చూపడంతో మార్కెట్లకు బలం చేకూరింది.బీఎస్‌ఈ సెన్సెక్స్ 482 పాయింట్లు (0.66 శాతం) పెరిగి 73,606.75 వద్ద స్థిరపడింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 153.20 (0.68 శాతం) లాభంతో 22,753.20 వద్ద ముగిసింది.మెటల్ షేర్లు మార్కెట్ ర్యాలీకి ప్రధానంగా దోహదపడ్డాయి. నిఫ్టీ మెటల్ సూచీ 2.2 శాతం ఎగబాకింది. ఫార్మా షేర్లలోనూ కొనుగోళ్లు వెల్లువెత్తడంతో నిఫ్టీ ఫార్మా సూచీ 1.67 శాతం పెరిగింది. హెల్త్‌కేర్ షేర్లు కూడా లాభాలు నమోదు చేశాయి. మరోవైపు మీడియా, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి.విస్తృత మార్కెట్లలోనూ సానుకూల ధోరణి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 1.19 శాతం పెరగగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 1.38 శాతం లాభపడింది. ఉదయం బలహీనంగా ఉన్న ఈ షేర్లు చివర్లో కోలుకోవడంతో మార్కెట్ సెంటిమెంట్ మెరుగుపడింది.నిఫ్టీలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, బీఎస్ఈ లిమిటెడ్, అదానీ పోర్ట్స్ షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి. మరోవైపు శ్రీరామ్ ఫైనాన్స్, టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ నష్టపోయిన షేర్ల జాబితాలో ఉన్నాయి.నిఫ్టీ 22,600 పైన నిలదొక్కుకుంటే 22,800?22,900 స్థాయుల దిశగా కదిలే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషించారు. అయితే, 22,800 పైన నిలకడగా ముగిస్తేనే మార్కెట్ ఊపునకు మరింత బలం చేకూరుతుందని తెలిపారు. మరోవైపు ఇండియా వీఐఎక్స్ 17.12 వద్ద ఉండటం మార్కెట్లో ఒడిదొడుకులు కొనసాగే అవకాశాలున్నాయని సూచిస్తోంది. అందువల్ల సూచీలు లాభాల్లో ముగిసినా, తదుపరి ట్రేడింగ్‌లోనూ అప్రమత్తత అవసరమని నిపుణులు భావిస్తున్నారు.

# యాసంగిలో తక్కువ నీటితో పండే పంటలనే సాగు చేయాలి.
# రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

**సూపర్ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి**
**రఘునాథపాలెం మండలంలోని గ్రామాలకు త్రాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు**
**మొదటి విడతలో 1,300 పైగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు, రెండవ విడతలో మరో 1,100 ఇళ్లు మంజూరు**
**రైతుల పొలాలకు రహదారుల నిర్మాణానికి ఇప్పటికే రూ.75 కోట్లు మంజూరు, త్వరలో మరో 25 కోట్లు**
**మల్లేపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం, నీటితో నిండిన నల్లకుంట చెరువు సందర్శన**





**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 26:** యాసంగి సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగు చేసే పంటలను తక్కువ నీటితో సాగు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు.

సోమవారం రఘునాథపాలెం మండలంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించారు. మండలంలోని మల్లేపల్లి గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. అనంతరం నల్లకుంట చెరువు నీటితో నిండిన సందర్భంగా చెరువు సందర్శించి చెరువులో పూలు వేశారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ మల్లేపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.

గతంలో రఘునాథపాలెం ప్రాంతం ఖమ్మం అర్బన్ మండలంలో భాగంగా ఉండేదని, ఆ సమయంలో ఈ ప్రాంతానికి పంచాయతీ రాజ్ నిధులు అందుబాటులో ఉండేవి కావని తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని అప్పటి మంత్రి జానారెడ్డిని కోరడంతో రఘునాథపాలెం మండలాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు.

రఘునాథపాలెం మండలానికి సాగునీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు:

కృష్ణా, గోదావరి నదులకు దూరంగా ఉన్న రఘునాథపాలెం మండలంలో గిరిజన జనాభా అధికంగా నివసిస్తోందని మంత్రి తెలిపారు. ఈ ప్రాంతంలో సాగునీటి సౌకర్యాలను మెరుగు పరిచేందుకు వెంకటాయపాలెం డీప్ కట్ నుంచి మంచుకొండ లిఫ్ట్ ద్వారా 25 చెరువులకు నీటిని అందించే ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. బుగ్గవాగు నుంచి మరో 11 చెరువులకు నీటిని అందించేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 46 మండలాల్లో రఘునాథపాలెం మండలానికి మాత్రమే సాగునీటి సౌకర్యాలు పరిమితంగా ఉన్నాయని, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా ప్రస్తుతం మండలంలోని కొంత ప్రాంతానికి నీరు అందుతోందని వివరించారు. వచ్చే సీజన్ నుంచి బుగ్గవాగు నీటిని కూడా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చెరువుల్లో నీరు నిల్వ ఉంటే భూగర్భ జలాలు పెరుగుతాయని, తద్వారా రైతులు కూరగాయలు, తక్కువ నీటితో పండే పంటలను సాగు చేసేందుకు అవకాశం కలుగుతుందని అన్నారు.

త్రాగునీటి సరఫరాకు చర్యలు:

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలోనే రఘునాథపాలెం మండలంలోని మొత్తం 36 గ్రామాల్లో ఓవర్‌హెడ్ సర్వీస్ రిజర్వాయర్లు (ఓహెచ్ఎస్ఆర్) నిర్మించి త్రాగునీటి సరఫరా పథకాలను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. అయితే ప్రస్తుతం భూగర్భ జలాలు తగ్గిపోవడంతో ఆ పథకాలు సక్రమంగా పనిచేయడం లేదని అన్నారు. ప్రస్తుతం పుట్టకోట నుంచి ప్రత్యేక పథకం ద్వారా రఘునాథపాలెం మండలం మొత్తానికి త్రాగునీటినీ సరఫరా చేస్తున్నామని తెలిపారు. సూపర్ ఎల్‌నినో కారణంగా కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని, మండల ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పుట్టకోట నీటి వనరులను నింపాలని అధికారులకు సూచించినట్లు వెల్లడించారు.

త్రాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించు కోవాలని అన్నారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నందున అందుబాటులో ఉన్న నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని, సహజ వనరులను వృథా చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు:

రఘునాథపాలెం మండలంలో మొదటి విడతలో 1,300 పైగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. రెండవ విడతలో మరో 1,100 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు చెప్పారు. గుడిసెల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు రాజకీయాలు, పార్టీలతో సంబంధం లేకుండా అర్హత ఆధారంగా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని స్పష్టం చేశారు. ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

రైతుల పొలాలకు రహదారుల నిర్మాణానికి రూ.100 కోట్లు:

రైతులు తమ పొలాలకు సులభంగా చేరుకునేందుకు రహదారుల నిర్మాణం కోసం ఇప్పటికే రూ.75 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. త్వరలో మరో రూ.25 కోట్లు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. దీంతో రైతుల పొలాలకు రహదారుల నిర్మాణానికి మొత్తం రూ.100 కోట్ల మేర నిధులు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు.

వీబీ-జీ రామ్‌జీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు, రైతులకు ఉపయోగపడే పనులను చేపట్టాలని సూచించారు.

యాసంగిలో తక్కువ నీటితో పండే పంటలకు ప్రాధాన్యం

సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో యాసంగి సీజన్‌లో వరి సాగుకు నీటి లభ్యత ఉండకపోవచ్చని మంత్రి తెలిపారు. రైతులు ఈ విషయాన్ని ముందుగానే గుర్తించి, అధిక నీరు అవసరమయ్యే వరి పంటకు బదులుగా తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని సూచించారు. ఉద్యాన పంటలను సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పంటలకు అవసరమైన నీటిని పొదుపుగా వినియోగించాలని అన్నారు. పశువులకు కూడా తగినంత నీరు అందేలా చూడాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో త్రాగునీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని, నీటిని, విద్యుత్‌ను వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని మంత్రి పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ప్రజాప్రతినిధులు రాయల నాగేశ్వరరావు, ఇతర స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, ఇరిగేషన్ డీఈ మోతీలాల్, సంబంధిత శాఖల అధికారులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీ శాల లక్ష్మీ వేంకటేశ్వరుడి రథోత్సవం

**పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,ఎమ్మెల్యే కేటీఆర్,**
**స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్న ప్రజాప్రతినిధులు**
**తరలివచ్చిన వేలాది మంది భక్తులు.. భక్తిపారవశ్యంలో సిరిసిల్ల**







**రాజన్న సిరిసిల్ల జిల్లా, అక్టోబర్ 26 ,( ప్రజాబలం ప్రతినిధి )** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం నిర్వహించిన స్వామివారి రథోత్సవం భక్తుల జయజయధ్వానాల నడుమ అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక వేడుకకు స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్), రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరయ్యారు.

రథోత్సవం సందర్భంగా ఇరువురు నేతలు రథం వద్దకు చేరుకుని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు. ఒకే వేడుకలో ఇరు పార్టీల ముఖ్య నేతలు పాల్గొని స్వామివారిని దర్శించుకోవడం స్థానికంగా విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. స్వామివారి రథోత్సవంలో పాల్గొనడం ఎంతో ఆనందాన్ని, ఆధ్యాత్మిక సంతృప్తిని ఇచ్చిందన్నారు. భక్తుల కోసం స్వామివారు రథంపై ఊరేగింపుగా రావడం, భక్తుల ముఖాల్లో కనిపించే భక్తిభావం మన సనాతన ధర్మ విశిష్టతను చాటుతాయని పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను కాపాడుకుంటూ ప్రతి ఒక్కరూ ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ క్షేత్రంతో పాటు సిరిసిల్లలోని ప్రాచీన ఆలయాలు ఈ ప్రాంత ఆధ్యాత్మిక వైభవానికి నిదర్శనాలని కొనియాడారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగుండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. రథోత్సవం పురస్కరించుకుని ఆలయ మాడ వీధులు భక్తులతో కిక్కిరిసిపోయాయి. 'గోవిందా.. గోవిందా..' నామస్మరణతో సిరిసిల్ల పురవీధులు మార్మోగాయి. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ రథం ముందుకు సాగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు సమర్పించారు. ఉత్సవాలు శాంతియుతంగా, విజయవంతంగా సాగేలా ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేశారు.

## అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు.



మొదటి పేజీ తరువాయి

సోమవారం కూసుమంచి మండలం గోరిల్లపాడు తండాలో రూ. 20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని మంత్రి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గ్రామానికి డబల్ రోడ్డు, పొలాలకు వెళ్లే దారులు, స్మశాన వాటికల ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. ఎల్2, ఎల్3, ఎల్1 లలో అర్హులైన పేదవాళ్లకు ఎవరికైనా పొరపాట్లు ఉంటే సరిదిద్ది ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నవారికైనా, అర్హులైతే ఈ ప్రభుత్వంలో ఇళ్లు ఇవ్వకుండా ఉండేది లేదని మంత్రి స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తానని, ఇప్పుడు రెండో విడత, ఆపై మూడు, నాలుగు విడతల్లో అర్హులందరికీ ఇస్తామని తెలిపారు.

ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రజలకు 200 యూనిట్ల ఉచిత కరెంట్, రైతు భరోసా, సన్న వడ్లు పండించిన రైతన్నలకు మద్దతు ధరతో పాటు బోనస్, ఆడబిడ్డలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం, తెల్ల రేషన్ కార్డులు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు అందించడం జరిగిందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, డీపీవో వినోద్ కుమార్, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, కూసుమంచి ఎంపీడీవో జస్వంత్ కుమార్, తహసీల్దార్ సైదులు, స్థానిక సర్పంచ్ బానోత్ సరస్వతి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రీ ఎంట్రీపై ఊహాగానాలు

హైదరాబాద్, అక్టోబరు 26, బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జాతీయ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించబోతున్నారంటూ కేటీఆర్ చేసిన ప్రకటన తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశమైంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ బలహీనపడుతోందని, ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ వైఫల్యాలు దేశంలో మరో ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక అవసరాన్ని తెస్తున్నాయని ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ జాతీయ స్థాయిలో ప్రాంతీయ పార్టీలను సమన్వయం చేస్తూ కీలక పాత్ర పోషిస్తారన్న సంకేతాలు బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపుతున్నాయి.కొంతకాలంగా జాతీయ స్థాయిలో రాజకీయ పరిణామాలు మారుతున్నాయి. కేంద్రంలో అధికార బీజేపీ సంకీర్ణ కూటమిపై ఆధారపడాల్సి వస్తోంది. కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండీ' కూటమిలో సమన్వయ లోపాలు బయటపడుతున్నాయి. దీంతో జాతీయ స్థాయిలో కాంగ్రెసేతర, బీజేపీయేతర ప్రత్యామ్నాయం కోసం ప్రాంతీయ పార్టీలు చూస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఈ రాజకీయ శూన్యతను భర్తీ చేసేందుకు కేసీఆర్ తన అనుభవం, జాతీయ రాజకీయాలపై ఉన్న పట్టును ఉపయోగించుకోవాలని వ్యూహం రచిస్తున్నట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వ విధానాలపై ప్రాంతీయ ఆత్మగౌరవ నినాదంతో ఇతర ప్రాంతీయ పార్టీలను ఏకం చేసే దిశగా తెరవెనుక కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం.కేటీఆర్ చేసిన ఈ ప్రకటన వెనుక కేవలం ఢిల్లీ పీఠాన్ని ప్రభావితం చేయడమే కాదు.. తెలంగాణలో రాబోయే స్థానిక సంస్థలు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంది. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన తర్వాత కొంత నైరాశ్యంలో ఉన్న కేడర్‌ను ఉత్తేజపరచడానికి ఇదొక స్ట్రాటజీ అయి ఉండొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కేసీఆర్ జాతీయ స్థాయిలో మళ్లీ చక్రం తిప్పుతారనే ప్రచారం మానసిక స్థైర్యాన్ని ఇస్తుందని భావిస్తున్నారు. అలాగే, రాబోయే రోజుల్లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారనే నినాదంతో శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేసే ప్లాన్ ఇది.మొత్తంగా చూస్తే కేసీఆర్ రీ ఎంట్రీ ప్రచారం అటు పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపడానికి ఎంతగా ఉపయోగపడుతుందో, జాతీయ స్థాయిలో ప్రాంతీయ పార్టీలను ఏకం చేయడంలో ఆయన ఏ మేరకు సఫలమవుతారనేది రాబోయే రాజకీయ పరిణామాలు తేల్చనున్నాయి

# మేజర్ గ్రామ పంచాయతీలో గుంపులు గుంపులుగా కోతులు భయంతో పరుగులు తీస్తున్న జనం పట్టింపు లేని గ్రామపంచాయతీ



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 26 ఏటూరు నాగారం** మేజర్ గ్రామపంచాయతీ ఏటూరు నాగారం మండల కేంద్రంలో రోజురోజుకు పెరిగిపోతున్న కోతుల సంతతి కోతుల వలన నానా ఇబ్బందులు పడుతున్న గ్రామ ప్రజలు రైతులు పలుమార్లు గ్రామపంచాయతీకి దరఖాస్తులు పెట్టుకున్న పట్టించుకోని గ్రామ కార్యదర్శి దీనితో రైతులు ఏమి చేయాలో తోచక ఎవరిని ఆశ్రయించాలో తెలియక అయోమయంలో పడుతున్నారు పండించే పంటను సైతం కూరగాయ మొక్కలు జామ చెట్లు సంబంధించి ఫలాల మొక్కలను కోతుల వలన చాలా ఇబ్బందులు గురికావాల్సిన పరిస్థితి కనబడుతుంది ముఖ్యంగా మహిళలు కోతులను చూసి భయంతో పరుగులు తీసి కాళ్లు చేతులు ఇరగకొట్టుకున్న పరిస్థితి ఏటూరునాగారంలో చాలా ఉన్నాయి కోతుల వలన చిన్న పిల్లలు భయంతో బయటికి రాలేని పరిస్థితి ఎక్కడ చూసిన కోతుల గుంపులు పొద్దున్నుంచి మొదలుకొని సాయంత్రం వరకు ఇండ్ల మధ్యనే ప్రజల మధ్య తిరుగుతూ ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటున్నాయి దీనితో పంట పొలాలపై చేరి పంట మొత్తం నాశనం చేస్తూ ఆ రైతులను నానా ఇబ్బందుల గురిచేస్తున్నాయి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్

ప్రజలకు కోతుల వలన ఎలాంటి సమస్యలు లేకుండా చేస్తానని మాట ఇచ్చిన మరల వీటి పైన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు ఇప్పటికైనా మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి ఏటూరు నాగారంలో ఉన్న కోతుల గుంపులను దూరం పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు

# సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి 'ఆజాద్ ఇంజనీరింగ్' చేయూత

## కేటీఆర్ చేతుల మీదుగా అత్యాధునిక వైద్య పరికరాల అందజేత

**రాజన్న సిరిసిల్ల జిల్లా, అక్టోబర్ 26 ,( ప్రజాబలం ప్రతినిధి )**రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు మరింత మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో ప్రముఖ సంస్థ ఆజాద్ ఇంజనీరింగ్ లిమిటెడ్ తన కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద భారీగా ఆధునిక వైద్య పరికరాలను విరాళంగా అందజేసింది. స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ప్రత్యేక చొరవతో సమకూరిన ఈ పరికరాలను ఆయన స్వయంగా ఆసుపత్రి వర్గాలకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఆజాద్ ఇంజనీరింగ్ లిమిటెడ్ చైర్మన్,సీఈఓ రాకేష్ చోప్దార్, టెక్నికల్ డైరెక్టర్ గెంట్యాల అశోక్ లతో పాటు ఆసుపత్రి వైద్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని చేరువ చేసేందుకు రోగ నిర్ధారణ, అత్యవసర చికిత్స, క్రిమిసంహారక/స్టెరిలైజేషన్ విభాగాల బలోపేతానికి ఈ పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయని కేటీఆర్ పేర్కొన్నారు. పేద రోగుల శ్రేయస్సు దృష్ట్యా విలువైన వైద్య పరికరాలను అందించిన ఆజాద్ ఇంజనీరింగ్ యాజమాన్యానికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

అందజేసిన 7 కీలక వైద్య పరికరాల వివరాలు

1. మొబైల్ మోర్చరీ ఫ్రీజర్
2. ఎలీసా ప్లేట్ రీడర్ , వాషర్
3. ట్రూబీట్ 200,12-ఛానల్ ఈసీజీ యంత్రం
4. స్పెక్ట్రా స్మార్ట్+ 12.1 అంగుళాల 5-పారామీటర్ మానిటర్







5. ఫుల్లీ ఆటోమేటిక్ హారిజాంటల్ సిలిండ్రికల్ స్టీమ్ స్టెరిలైజేషన్ చాంబర్
6. ఆర్తీ వర్టికల్ స్టెరిలైజర్ -- ఆటోమేటిక్
7. వ్యాక్టెక్ సక్షన్ ఉపకరణం

ఈ ఆధునిక యంత్రాల రాకతో రాజన్న సిరిసిల్ల ప్రాంత ప్రజలకు మరింత వేగవంతమైన, అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ , వైద్య బృందం హర్షం వ్యక్తం చేశారు.

# బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 500 కుటుంబాలు.

## ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ సమక్షంలో చేరిక.

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 26:**ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సమక్షంలో కొణిజర్ల మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కొణిజర్ల మండలానికి చెందినబిఆర్ఎస్

జిల్లా నాయకులు బోడపోతుల బాబు, దేరంగుల వెంకటరమణ బ్రహ్మం ఆధ్వర్యంలో సుమారు 500 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరగా, ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్





వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు సాగుతున్న కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ.

కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులకు హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం కల్పిస్తూ, అందరినీ కలుపుకొని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కొణిజర్ల మండలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.సుడా చైర్మన్ శ్రీ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.

కాంగ్రెస్ పార్టీలోకి చేరిన ప్రతి ఒక్కరికీ స్వాగతం పలుకుతూ, పార్టీ బలోపేతానికి అందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తూ, ప్రజలకు సేవ చేసే దిశగా ముందుకు సాగుతామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సవాళ్ల నాగేశ్వరరావు, టిపిసిసి వైరా నియోజకవర్గ నాయకులు వడ్డే నారాయణరావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు రాంపూడి రోశయ్య, వైరా మార్కెట్ కమిటీ చైర్మన్ బొళ్ళ గంగారావు, ఎన్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ లచ్చి రామ్ నాయక్, సర్పంచులు సంఘం జిల్లా అధ్యక్షులు అబ్బూరి నరహరి, వైరా నియోజకవర్గ మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ కోసూరి శ్రీను, కొనిజర్ల మండల నాయకులు చిరంజీవి, చింతనిప్పు నరసింహారావు, రాయల పుల్లయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నఫీసియా మసీదు అధ్యక్షుడిగా అబ్దుల్ రజాక్ ఖురేషి హ్యాట్రిక్ విజయం!

## వరుసగా మూడోసారి గెలుపు.. త్రిబుల్ ధమాకాతో మద్దతుదారుల్లో సంబరాలు

**జగిత్యాల జిల్లా: ప్రజా బలం ప్రతినిధి** ఎండి ఇక్రముద్దీన్ 26 అక్టోబర్):జగిత్యాల పట్టణంలోని నఫీసియా మసీదు అధ్యక్ష ఎన్నికల్లో అబ్దుల్ రజాక్ ఖురేషి ఘన విజయం సాధించారు. వరుసగా మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నికై హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేశారు. దీంతో ఆయన మద్దతుదారులు హర్షం వ్యక్తం






చేశారు.నఫీసియా మసీదు అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో అబ్దుల్ రజాక్ ఖురేషి తన ఎన్నికల గుర్తు త్రాసుపై పోటీ చేసి విజయం సాధించారు. ఎన్నికల కమిటీ వెల్లడించిన వివరాల ప్రకారం, ఆయనకు 140 ఓట్లు లభించగా, 9 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. గతంలో రెండుసార్లు అధ్యక్షుడిగా సేవలందించిన ఆయనకు మూడోసారి కూడా మద్దతు లభించడం విశేషం.నాలుగు మసీదుల ఎన్నికల ఫలితాలుజగిత్యాల పట్టణంలోని పలు మసీదుల అధ్యక్ష ఎన్నికల ఫలితాలను ఎన్నికల కమిటీ వెల్లడించింది.నఫీసియా మసీదు: అబ్దుల్ రజాక్ ఖురేషి 140 ఓట్లు సాధించి, 9 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.ఖమర్ మసీదు: మహమ్మద్ అబ్దుల్లా 128 ఓట్లు సాధించి, 58 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.హమిదియా మసీదు: సయ్యద్ జమీల్ మాలిక్ 155 ఓట్లు సాధించి, 67 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.జలీలీ మసీదు: ఎండీ తఫ్హీమ్ ఉద్దీన్ 113 ఓట్లు సాధించి, 9 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.పూలమాలలతో ఘన సన్మానంఅధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన అబ్దుల్ రజాక్ ఖురేషిని నూతన, పాత కమిటీ సభ్యులు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మద్దతుదారులు అభినందనలు తెలియజేశారు. వరుసగా మూడోసారి విజయం సాధించడంతో ఆయన అనుచరుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.మసీదు అభివృద్ధికి కృషి చేస్తాగత నాలుగేళ్లుగా మసీదు సేవా కార్యక్రమాల్లో తనకు సహకరించిన ముస్లిం సోదరులు, మసీదు పెద్దలు, కమిటీ సభ్యులు, మద్దతుదారులందరికీ అబ్దుల్ రజాక్ ఖురేషి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి మరోసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు.మసీదు అభివృద్ధికి, సేవా కార్యక్రమాల నిర్వహణకు, ముస్లిం సోదరుల ఐక్యతకు ప్రాధాన్యమిస్తూ అందరి సహకారంతో ముందుకు సాగుతానని తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మసీదు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని అయినా అన్నారు. వరుసగా మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నికై అబ్దుల్ రజాక్ ఖురేషి హ్యాట్రిక్ విజయం సాధించడం జగిత్యాల పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

# ఇంద్రకీలాద్రి లో గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి ఆశ్వయుజ పౌర్ణమి సందర్బంగా ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ ఈరోజు ఉదయం ఘనంగా జరిగింది.శ్రీ దుర్గా మల్లేశ్వరులు, శ్రీ విఘ్నేశ్వరుడు,శ్రీ సుబ్రహ్మణ్యస్వామి, శ్రీ ఆంజనేయస్వామి వంటి సకల దేవతలు కొలువైన ఇంద్రకీలాద్రి చుట్టూ గిరి ప్రదక్షిణ చేయడం వలన కోరిన కోరికలు తీరుతాయని ప్రతీతి. పౌర్ణమి రోజున సకల దేవతలు కొలువైన ఇంద్రకీలాద్రిగిరి ప్రదక్షిణ చేయడం మరింత శ్రేష్టమని పండిత ఉవాచ.ఆశ్వయుజ పౌర్ణమిని పురస్కరించుకుని ఈరోజు ఉదయం ఘాట్ రోడ్డు ఎంట్రెన్స్ వద్ద గల శ్రీ కామధేను అమ్మవారి సన్నిధి నుండి ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ వైభవంగా ప్రారంభంకాగా…ఆలయ అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి గిరి ప్రదక్షిణ కార్యక్రమంను ప్రారంభించారు.ధర్మ ప్రచారం నిమిత్తం దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంప్రదాయకోలాట నృత్యప్రదర్శనలు, భజన సంకీర్తనా గానం వంటి కళా బృందాల కళా ప్రదర్శనలు, మంగళవాయిద్యముల, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ గిరి ప్రదక్షిణ కార్యక్రమం వైభవంగా నిర్ణయించిన మార్గంలో సాగింది.ఘాట్ రోడ్ శ్రీ అమ్మవారి గుడి,కుమ్మరిపాలెం సెంటర్, విద్యాధరపురం, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణవీధి నుండి తిరిగి ఇంద్రకీలాద్రి వరకు గిరిప్రదక్షిణ కొనసాగనుంది.శ్రీ దుర్గా మల్లేశ్వరులు కొలువైన వాహనం ముందు రహదారులను వివిధ ప్రాంతాల్లోస్థానిక మహిళలు పసుపు నీళ్లతో శుద్ధి చేసి, హారతులు,కొబ్బరికాయలు సమర్పించి, జయ జయద్వానాలు చేశారు.గిరి ప్రదక్షిణ మార్గమంతా భక్తులకు శ్రీ అమ్మవారి కుంకుమ, ప్రసాదంను భక్తులకు దేవస్థానం నుండి అందజేయడమైనది.వేలాది మంది భక్తులు విశేషముగా ఈ కార్యక్రమంలో పాల్గొని, అమ్మవారిని స్వామివారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో కిషోర్ కుమార్, సూపరెండెంట్ హేమ దుర్గాంబ, సీనియర్ అసిస్టెంట్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

# ప్రకాశం జిల్లాలో ఆరేళ్ల బాలికపై హత్యాచారం

ఒంగోలు జిల్లాలో ఆరేళ్ల చిన్నారిపై ఆత్యాచారం, హత్య ఘటన కలకలంరేపింది. మృతురాలు ను నాగులుప్పలపాడు మండలంలో ఉన్న అమ్మమ్మ వద్ద ఉంచిని తల్లిదండ్రులు హైదరాబాద్‌లో బేల్దారి పని చేస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి ఇంటి బయట నిద్రిస్తున్న బాలికను ఆనంద్ అనే వ్యక్తి ఎత్తుకెళ్లి అత్యాచారం చేసి హతమార్చాడు. తరువాత బయట కుర్చీలో మృతదేహాన్ని పెట్టి పరారైయాడు. స్థానికులు నిందితుడిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

# భవిష్యత్ తరాలకు పర్యావరణ రహిత సమాజాన్ని అందించాలి.

## 20 వార్డు కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు వన మహోత్సవ కార్యక్రమం ప్రారంభం.

## పచ్చదనాన్ని పెంచడం, కాలుష్యాన్ని తగ్గించడం..

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 26**20 వ వార్డ్ సిఎస్ ఐ చర్చి రోడ్ నందు వన మహోత్సవం లో భాగంగా ఇంటింటికి మొక్కల పంపిణి కార్యక్రమాన్నిమొదటగా పువ్వాళ్ళ రాము ఇంటి దగ్గర కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు స్వయంగా మొక్కలు నాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కల పంపిణీ అనేది సమాజంలో పర్యావరణ చైతన్యాన్ని పెంచడానికి ఉపయోగపడుతుంది అని మరియు ప్రతి ఒక్కరు ఇందులో భాగస్వామ్యం కావాలని సూచించారు. మొక్కను నాటడం ఎంత ముఖ్యమో, అది ఆరోగ్యంగా పెరిగేలా చూసుకోవడం కూడా అంతే ముఖ్యం అని,పచ్చదనాన్ని పెంచడం, కాలుష్యాన్ని






తగ్గించడం మరియు భూగర్భ జలాల స్థాయిని మెరుగుపరచడం అందరి భాద్యత అని తెలిపారు. మనం నాటే ప్రతి చిన్న మొక్క రేపటి తరానికి పెద్ద ఆస్తి అవుతుంది. కేవలం మొక్కలు నాటడమే కాకుండా, వాటిని సంరక్షించడం మన బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కాంగ్రెస్ నాయకులూ పువ్వాళ్ళ రాము, బిక్యా, పందు, హుస్సేన్,పృథ్వి ,నవీన్,కృష్ణ , రవి,జవాన్ అనిల్, గ్రామ దీపిక తిరుపమ్మ,రాణి తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల అరెస్టులు ప్రజాస్వామ్యానికి మచ్చ

## హామీలు నెరవేర్చకుంటే ఉద్యమాలను ఉధృతం చేస్తాం

## డా. కె.వి. కృష్ణారావు

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 26:**తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలకు సైతం వెనుకాడని ఉద్యమకారులను ముందస్తు అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికి మచ్చని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి డా. కె.వి. కృష్ణారావు పేర్కొన్నారు . ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అక్రమ అరెస్టులు, తప్పుడు కేసులతో భయభ్రాంతులకు గురిచేయడం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని అన్నారు . ఎన్నికల ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై ఈ నెల 26వ తేదీలోపు ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ డిమాండ్ పిలుపు మేరకు సీఎం ఇంటి ముట్టడి నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర మొత్తం మీద ఉద్యమకారులను పోలీసులు ఎక్కడికక్కడ హౌస్ అరెస్టులు , అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు . తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను తక్షణమే వేగవంతం చేసి , పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు . ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోలు , ధర్నాలు , ఆందోళనలు చేపట్టి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో పగడాల నరేందర్ , లింగానబోయిన సతీష్ , డో కుపర్తి సుబ్బారావు , రెడ్డబోయిన వరలక్ష్మి , కామని అనంత లక్ష్మి , స్వరూప రెడ్డి , కమలమ్మ , ధన లక్ష్మీ , యాక లక్ష్మీ తదితరులు ఉన్నారు .



# విజయ్ బాటలోనే త్రిష?



చెన్నై, అక్టోబరు 26, (న్యూస్ పల్స్) సినీ తారలు షాపింగ్ మాల్స్, మొబైల్ షోరూమ్‌ల ప్రారంభోత్సవాలకు రావడం మామూలే కానీ.. కోయంబత్తూరు వీధుల్లో సౌత్ క్వీన్ త్రిష సృష్టించిన సునామీ మాత్రం ఇటు కోలీవుడ్‌ను, అటు తమిళనాడు రాజకీయ వర్గాలను ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. ఒక చిన్న మొబైల్ షాప్ ఓపెనింగ్ కోసం వచ్చిన త్రిష, ఏకంగా ఒక బడా పొలిటికల్ లీడర్ రేంజ్‌లో కారు సన్‌రూఫ్ నుంచి బయటకు వచ్చి.. వేలాదిగా తరలివచ్చిన జనసందోహానికి చిరునవ్వుతో అభివాదం చేస్తూ హంగామా చేసింది. ఎర్రటి కాటన్ చీరలో దేవతలా మెరిసిపోతూ ఆ నడిరోడ్డుపై ఆమె చేసిన మాస్ రోడ్ షో చూసి కంగారు పడటం కోయంబత్తూరు వాసుల వంతయింది.ఈ రోడ్ షో వీడియోలు నెట్టింట ప్రత్యక్షమవ్వడమే ఆలస్యం.. తమిళనాడు సోషల్ మీడియా స్టీమ్ రేంజ్‌లో వేడెక్కిపోయింది. ఇది షాపింగ్ మాల్ ప్రమోషన్ లా లేదు.. ముమ్మాటికీ అంచెలంచెలుగా ప్లాన్ చేసిన పొలిటికల్ కల్ట్ స్ట్రాటజీలా ఉంది అంటూ ఎక్స్ , ఇన్‌స్టాగ్రామ్‌లలో కామెంట్ల వర్షం కురుస్తోంది. మొబైల్ షాప్ ప్రారంభించడానికి వచ్చిన భామ, ఆ పనిని ఎలక్షన్ ర్యాలీగా మార్చేయడం వెనుక సాధారణమైన పబ్లిసిటీ మాత్రమే లేదని, ప్రజల్లో తనకున్న క్రేజ్‌ను చెక్ చేసుకోవడానికే ఈ స్థాయి పబ్లిక్ కనెక్ట్ షో ప్లాన్ చేసిందని గట్టి ప్రచారం సాగుతోంది.దళపతి విజయ్ పార్టీలో చేరి ఆమె కీలకపాత్ర పోషిస్తారన్న ప్రచారం జరుగుతోంది. తిరుచ్చి ఉపఎన్నిక ఇంకా జరగాల్సి ఉంది. ఆమె పేరు తరచూ ప్రచారంలోకి వస్తూనే ఉంది.తమిళనాడులో పురాతన కాలం నుంచి సినీ స్టార్లను నెత్తిన పెట్టుకుని రాజకీయాల్లో కిరీటాలు కట్టబెట్టే ఆచారం ఉంది కాబట్టి, త్రిష ప్లాన్ కూడా అదేనని నెటిజన్లు విశ్లేషిస్తున్నారు.మరోవైపు, ఎరుపు రంగు శారీలో త్రిష మెరిసిన గ్లామరస్ లుక్స్, ఆమె కారు పైనుంచి అభిమానులకు ఫ్లయింగ్ కిస్‌లు ఇస్తున్న వీడియోలు ప్రస్తుతం నెట్టింట రికార్డు వ్యూస్‌తో దూసుకుపోతున్నాయి.రాజకీయాల్లోకి వస్తే ప్రత్యర్థులకు నిద్రలేకుండా చేసే గ్లామర్ అండ్ మాస్ ఫాలోయింగ్ త్రిష సొంతం అంటూ ఫ్యాన్స్ హంగామా చేస్తుంటే.. మేడమ్ మైక్ పట్టుకోవడం ఖాయం" అంటూ మీమర్స్ సోషల్ మీడియాను షేక్ చేస్తున్నారు. మొత్తానికి ఒక చిన్న షాప్ ఓపెనింగ్‌తో తమిళనాడు పొలిటికల్ అండ్ సినిమా సర్కిల్స్ రెండింటిలోనూ త్రిష పెట్టిన మంటలు త్వరలో ఎలాంటి మలుపు తిరుగుతాయో చూడాలి!

# మల్లవరం పంచాయతీలో గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు.





**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 26:**తల్లాడ మండల పరిధిలోని మల్లవరం గ్రామంలో సోమవారం సర్పంచ్ కటికి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు.ఖమ్మం బాలల పరిరక్షణ విభాగం నుండి కౌన్సిలర్ నిరోషా ఈ కార్యక్రమానికి హాజరై ఎంపీడీవో ఆధ్వర్యంలో గ్రామ సమక్షంలో సమగ్ర బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు.కమిటీ ముఖ్య ఉద్దేశాన్ని మరియు గ్రామంలో ఉన్న పిల్లలు ఎదుర్కొన్న సమస్యలకు ఈ కమిటీ చేయవలసిన విధివిధానాలన్నీ కూడా క్లుప్తంగా వివరించారు. గ్రామంలో బాలల హక్కుల పోరాటం ఇబ్బందులకు గురికాకుండా మరియు బాల్యవివాహాలు జరగకుండా బాల కార్మికులు లేకుండా గ్రామపంచాయతీలు చూడటం అందరు పిల్లలు బడికి వెళ్లేలా చూడటం ఈ కమిటీ యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్ రాజు,గ్రామ సర్పంచ్ కటికి కిరణ్ ,పంచాయతీ సెక్రెటరీ సిద్ధిక్, డిసిపిఓ నిరోషా, గ్రామం ఉప సర్పంచ్ యశోద, స్వచ్ఛంద సేవా సంస్థ రామదాసు అంగన్వాడీ టీచర్లు ఏఎన్ఎం ఆశ వర్కర్ గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# అర్హతలు లేకుండా వైద్యం.. క్లినిక్ సీజ్

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు:

## డీఎంహెచ్ఓ డాక్టర్ కె. ఆనంద్

**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం అక్టోబర్ 26:** జిల్లాలో చట్టవిరుద్ధంగా వైద్య సేవలు అందించే వారిపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కఠిన చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఉప్పల్, రామంతాపూర్, బోడుప్పల్ ప్రాంతాల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ఆనంద్ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బోడుప్పల్‌లో సరైన రిజిస్ట్రేషన్ లేకుండా, అవసరమైన అర్హతలు లేని వ్యక్తి నిర్వహిస్తున్న మమత క్లినిక్‌ను అధికారులు గుర్తించి సీజ్ చేశారు.



రామంతాపూర్‌లోని శ్రీ గాయత్రి కేంద్రాన్ని తనిఖీ చేసిన అధికారులు పీసీపీఎన్‌డీటీ చట్ట నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. ఉప్పల్‌లోని యూవీ డయాగ్నస్టిక్ సెంటర్‌లోనూ తనిఖీలు చేపట్టి నిర్వహణకు సంబంధించిన అంశాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా డాక్టర్ కె. ఆనంద్ మాట్లాడుతూ, ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడమే వైద్య ఆరోగ్యశాఖ లక్ష్యమన్నారు. సరైన అనుమతులు లేకుండా వైద్య కేంద్రాలను నిర్వహించడం, అర్హతలు లేని వ్యక్తులు వైద్య సేవలు అందించడం, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్, పీసీపీఎన్‌డీటీ చట్టాలను ఉల్లంఘించడం వంటి చర్యలను ఉపేక్షించబోమని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలోని ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ కేంద్రాలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్లు, అనుమతులు పొందాలని, ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. ఉల్లంఘనలను అరికట్టేందుకు జిల్లావ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు.

ఈ తనిఖీల్లో కీసర డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గీత, జిల్లా ఎంసీహెచ్/సీఐఏ ప్రోగ్రాం అధికారి డాక్టర్ గీత, అదనపు ప్రోగ్రాం అధికారి డాక్టర్ పవన్ రెడ్డి, డిప్యూటీ డీఈఎంఓ వసంత కుమారి పాల్గొన్నారు.

# జమ్మికుంట పోలీస్ స్టేషన్ లో ఓపెన్ హౌస్ కార్యక్రమం



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 26**పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జమ్మికుంట పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. హుజూరాబాద్ ఏసీపీ ఆధ్వర్యంలో పట్టణ సీఐ రామకృష్ణ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.



ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్ స్టేషన్‌లో నిర్వహించే వివిధ విధులు, కేసుల నమోదు, దర్యాప్తు ప్రక్రియ, ప్రజలకు అందించే పోలీస్ సేవలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.పోలీస్ వ్యవస్థ పనితీరు, పోలీసుల విధులు, ప్రజల భద్రత కోసం చేపడుతున్న చర్యలను విద్యార్థులకు వివరించారు. పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను విద్యార్థులు పరిశీలించారు. పోలీసుల విధులు, బాధ్యతలపై అవగాహన పెంపొందించడమే కార్యక్రమం ఉద్దేశ్యమని తెలిపారు.

# డ్రగ్స్ మాఫియాపై కేంద్రం సర్జికల్ స్ట్రైక్..

బెంగళూరు, అక్టోబరు 26, (న్యూస్ పల్స్) డ్రగ్స్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ ట్రైడెంట్'లో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. అంతర్జాతీయ డ్రగ్స్ నెట్‌వర్క్‌ను లక్ష్యంగా చేసుకుని కేంద్ర దర్యాప్తు సంస్థలు, ఈశాన్య రాష్ట్రాల పోలీసులు సంయుక్తంగా భారీ ఆపరేషన్ నిర్వహించారు. మణిపూర్, అసోం, మిజోరం రాష్ట్రాల్లోని 38 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు చేపట్టి 18 మంది అనుమానిత స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ చర్యల్లో భాగంగా సుమారు రూ.100 కోట్ల హవాలా లావాదేవీలకు సంబంధించిన వివరాలను గుర్తించడంతో పాటు 1,424 బ్యాంకు ఖాతాలను సీజ్ చేసినట్లు వెల్లడైంది. భారత్-మయన్మార్-బంగ్లాదేశ్ సరిహద్దుల మీదుగా సాగుతున్నట్లు భావిస్తున్న అంతర్జాతీయ డ్రగ్స్ అక్రమ రవాణా నెట్‌వర్క్‌పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈశాన్య రాష్ట్రాల్లోని సున్నితమైన ప్రాంతాల్లో సమన్వయంతో తనిఖీలు, దాడులు నిర్వహించారు. మాదకద్రవ్యాల సరఫరా మార్గాలను గుర్తించడం, వాటి వెనుక ఉన్న వ్యక్తులను పట్టుకోవడం, అక్రమ లావాదేవీలను వెలికితీయడం ఈ ఆపరేషన్ ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. ఈ దాడుల్లో 18 మంది అనుమానితులను అదుపులోకి తీసుకోవడంతో పాటు ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన కీలక ఆధారాలను అధికారులు సేకరించినట్లు సమాచారం. సీజ్ చేసిన బ్యాంకు ఖాతాల ద్వారా డ్రగ్స్ వ్యాపారానికి సంబంధించిన ఆర్థిక మూలాలను గుర్తించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. డ్రగ్స్ అక్రమ రవాణా వెనుక భారీ స్థాయిలో ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. సుమారు రూ.100 కోట్ల విలువైన హవాలా లావాదేవీలకు సంబంధించిన వివరాలు వెలుగులోకి రావడం ఈ కేసులో కీలకంగా మారింది.

దీంతో సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న 1,424 బ్యాంకు ఖాతాలను అధికారులు సీజ్ చేసినట్లు వెల్లడైంది. ఈ లావాదేవీల వెనుక ఎవరున్నారు? డ్రగ్స్ విక్రయాల ద్వారా వచ్చిన డబ్బును ఏయే మార్గాల్లో తరలించారు? ఈ నెట్‌వర్క్‌కు ఇతర ప్రాంతాల్లోనూ సంబంధాలున్నాయా? అనే అంశాలపై దర్యాప్తు కొనసాగనుంది. ఆర్థిక లావాదేవీలను విశ్లేషించడం ద్వారా ఈ అక్రమ వ్యాపారానికి సంబంధించిన మరిన్ని వివరాలు బయటపడే అవకాశం ఉంది. ఈ ఆపరేషన్‌లో 500 డిటోనేటర్లను స్వాధీనం చేసుకున్నట్లు వచ్చిన సమాచారం మరింత ఆందోళన కలిగిస్తోంది. డ్రగ్స్ అక్రమ రవాణా కేసులో డిటోనేటర్లు బయటపడటంతో వాటి నిల్వ, రవాణా వెనుక ఉన్న ఉద్దేశాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే వీటిని ఏ కార్యకలాపాల కోసం వినియోగించాలనుకున్నారు? డ్రగ్స్ నెట్‌వర్క్‌తో వాటికి ఉన్న సంబంధం ఏమిటి? అనే అంశాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది. సరిహద్దు ప్రాంతాల్లో అక్రమ రవాణాను అడ్డుకోవడంతో పాటు మాదకద్రవ్యాల సరఫరా వ్యవస్థకు ఆర్థికంగా, లాజిస్టిక్స్ పరంగా సహకరిస్తున్న నెట్‌వర్క్‌లను గుర్తించడం భద్రతా సంస్థలకు కీలకంగా మారింది. దేశంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా అంతర్జాతీయ సరిహద్దుల గుండా జరిగే అక్రమ రవాణా, హవాలా లావాదేవీలు, డ్రగ్స్ పంపిణీ వ్యవస్థలపై నిఘా పెంచుతోంది. 'ఆపరేషన్ ట్రైడెంట్'లో భాగంగా చేపట్టిన దాడులు ఈ ప్రయత్నాల్లో కీలక పరిణామంగా నిలిచాయి.

2029 డిసెంబర్ 31 నాటికి దేశంలో డ్రగ్స్ అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలనే లక్ష్యంతో చర్యలు చేపడుతున్నట్లు పేర్కొంటున్నారు. అయితే ఈ ఆపరేషన్‌కు సంబంధించిన అధికారిక ప్రకటనలు, స్వాధీనం చేసుకున్న వస్తువుల పూర్తి వివరాలు, అరెస్టయిన వారి పాత్రపై మరింత స్పష్టత రావాల్సి ఉంది. డ్రగ్స్ సరఫరా మార్గాలను ధ్వంసం చేయడం, అక్రమంగా సంపాదించిన సొమ్మును గుర్తించడం, అంతర్జాతీయ నెట్‌వర్క్‌లను ఛేదించడం ద్వారా మాదకద్రవ్యాల వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలని భద్రతా సంస్థలు లక్ష్యంగా పెట్టుకున్నాయి.

## నీరు వృథా చేస్తే రూ.5 వేలు జరిమానా..

## ట్యాంకర్ల నుంచి లీకైనా ఫైన్ తప్పదు.. జలమండలి ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబరు 26, సాధారణంగా వేసవిలో నీటి సమస్య తలెత్తుతుంది. కానీ ఈసారి వర్షాభావం కారణంగా నగరాల్లో అక్టోబర్‌లోనే నీటి సమస్యలు మొదలయ్యాయి. హైదరాబాద్‌లో వేసవిలో బుక్ చేసిన స్థాయిలో ఇప్పుడే ట్యాంకర్లను బుక్ చేస్తున్నారు. దీంతో నీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రభుత్వ పిలుపునిస్తోంది.

తాగునీటిని వృథా చేసే వారిపై రూ. 5 వేలు జరిమానా విధించనున్నట్లు జలమండలి ప్రకటించింది. ఈ నిబంధన నీటిని సరఫరా చేసే వాటర్ ట్యాంకర్లకు సైతం వర్తిస్తుందని జలమండలి అధికారులు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ఈసారి వర్షాకాలంలో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవలేదు. దీంతో అక్టోబర్ నెలలోనే నీటి కొరత సమస్య మొదలైంది.

ఇక వేసవిలో సమస్య మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. రబీలో వరి సాగు చేయొద్దని.. విద్యుత్, నీటిని పొదుపుగా వాడాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పించేలా సెలబ్రెటీలతోనూ ప్రచారం నిర్వహించనున్నారు. భాగ్యనగరంలో డిసెంబర్ నుంచి నీటి కొరత తీవ్రమయ్యే అవకాశం ఉందని జలమండలి ఇప్పటికే హెచ్చరించింది. నగరానికి తాగు నీటిని సరఫరా చేసే సింగూరు, మంజీరా రిజర్వాయర్లలో నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరువైంది. జీహెచ్ఎంసీ పరిధిలో రోజుకు 735 మిలియన్ గ్యాలన్ల తాగునీరు అవసరం కాగా.. జలమండలి 585 మిలియన్ గ్యాలన్లు మాత్రమే సరఫరా చేయగలగుతోంది. దీంతో చాలా ప్రాంతాల్లో లో ప్రెషర్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో నీటిని జాగ్రత్తగా, పొదుపుగా వాడుకోవాలని సూచించింది. ప్రభుత్వం పదేపదే సూచిస్తున్నప్పటికీ.. కొందరు మాత్రం నీటి వృథా మానడం లేదు. దీంతో కార్లు కడగటం లాంటి పనులతో నీళ్లు వేస్ట్ చేసే వారిపై భారీ జరిమానాలకు నగరపాలక సంస్థలు, జలమండలి సిద్ధం అవుతున్నాయి. రాష్ట్ర జలమండలి సూచనల నేపథ్యంలో నీటిని వృథా చేస్తే రూ.5 వేల జరిమానా విధిస్తామని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రకటించింది. వాటర్ ట్యాంకర్లకు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయని వెల్లడించింది. నవంబర్ 1 నుంచి ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. నీటి పొదుపు కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ టీమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. హైదరాబాద్‌లో అక్టోబర్ నెలలోనే వేసవి స్థాయిలో రోజుకు 7 వేల వాటర్ ట్యాంకుల బుకింగ్స్ జరుగుతున్నాయి. దీంతో ప్రయివేట్ ట్యాంకర్ల దందా ఊపందుకుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ జలమండలి ట్యాంకర్ల నీటి లీకేజీల విషయంలో కఠిన చర్యలకు ఉపక్రమిస్తోంది. రవాణా చేసే సమయంలో నీరు వృథాగా పోతే.. ట్యాంకర్ యజమానికి రూ.5 వేలు జరిమానా విధించాలని నిర్ణయం తీసుకుంది. ఇది తొలిసారి మాత్రమే, జరిమానా విధించిన తర్వాత కూడా ట్యాంకర్ నుంచి నీరు వృథాగా పోతున్నట్లు గమనిస్తే.. ఏకంగా ట్యాంకర్ రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని హెచ్చరించింది. నవంబర్ 1 నుంచి ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ప్రకటించారు.

దీంతో మూతలు బిగించకుండా నీటిని మోసుకెళ్లే ట్యాంకర్లకు ఇక నుంచి తిప్పలు తప్పవు. నీటిని వృథా చేస్తే రూ.5 వేలు జరిమానా విధించాలనే నిర్ణయం హైదరాబాద్, వరంగల్ నగరాలకే పరిమితం కాలేదు. బెంగళూరు వాటర్ సప్లై అండ్ సీవరేజి బోర్డు సైతం తాగు నీటిని వృథా చేసే వారికి రూ.5 వేలు జరిమానా విధిస్తామని తొలిసారి 2024లో ప్రకటించింది. ఎవరైనా నీటిని వృథా చేస్తున్నట్లు గమనిస్తే 1916కు ఫిర్యాదు చేయొచ్చని సూచించింది. 2024 నుంచి బెంగళూరులో ఈ నిబంధనను అమలు చేస్తున్నారు.

## రైతులకు అండగా రోటరీ క్లబ్..

## బాలికలకు ఉచిత సైకిళ్ల పంపిణీకి నిర్ణయం






మహబూబాబాద్, సేవా కార్యక్రమాలతో సమాజాభివృద్ధికి తోడ్పడటమే లక్ష్యంగా మహబూబాబాద్ రోటరీ క్లబ్ ముందడుగు వేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత ఆరోగ్య శిబిరాల నిర్వహణతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికలకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేయాలని క్లబ్ సమావేశంలో నిర్ణయించారు. ఇదే సమావేశంలో రైతులకు ఉపయోగపడే వ్యవసాయ పరికరాలను రూపొందిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కంబాలపల్లి గ్రామానికి చెందిన షణ్ముఖాచారిని ఘనంగా సన్మానించారు. రోటరీ క్లబ్ సమావేశంలో ఈ ఏడాది చేపట్టాల్సిన సేవా కార్యక్రమాలపై సభ్యులు విస్తృతంగా చర్చించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలను చేరువ చేసేందుకు ఉచిత ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికలకు ఉచితంగా సైకిళ్లు అందించే కార్యక్రమంపైనా చర్చించారు. మహబూబాబాద్ రోటరీ క్లబ్‌కు మంజూరైన సైకిళ్ల పంపిణీ ప్రక్రియలో భాగంగా సభ్యులు తమ డిపాజిట్ రుసుమును చెల్లించాలని, అర్హులైన బాలికల వివరాలను సేకరించి అందించాలని నిర్ణయించారు. ఈ వివరాలు సమర్పించిన అనంతరం మంజూరైన సైకిళ్లను బాలికలకు ఉచితంగా అందజేయనున్నారు.

# భారీ వర్ష సూచన.. అప్రమత్తంగా ఉండాలి.

## అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 26:** బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సోమవారం రాత్రి జూమ్ మీటింగ్ నిర్వహించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సహాయక చర్యలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో రానున్న మూడు రోజుల పాటు భారీ నుండి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. జిల్లాలో వర్షాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేందుకు 24/7 ప్రాతిపదికన కంట్రోల్ రూమ్‌ను మూడు షిఫ్టులలో నిర్వహించాలని అన్నారు. విపత్తు నిర్వహణలో క్షేత్రస్థాయిలో తహసీల్దార్ నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారన్నారు. విద్యుత్, తాగునీరు, మత్స్య, సాగునీరు, అగ్నిమాపక, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులతో తహసీల్దార్లు సమన్వయం చేసుకుంటూ తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పాలేరు, వైరా రిజర్వాయర్ల వద్ద నీటి మట్టాలను నిరంతరం పర్యవేక్షించాలని, నీరు ఓవర్‌ఫ్లో అయ్యే ముందు దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వచ్చు నీటిని సమర్థవంతంగా వినియోగించుకుంటూ నింపాల్సిన చెరువులను ముందే నింపుకోవాలని సూచించారు.

ఖమ్మం, ఎదులాపురం మున్సిపల్ కమిషనర్లు మున్నేరు వాగు పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తంగా ఉంచాలని, అవసరమైన చోట పునరావాస కేంద్రాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. లైఫ్ జాకెట్లు, లైఫ్ బోయ్స్, జేసీబీలు, ట్రాక్టర్లను సిద్ధం చేసుకోవాలని తెలిపారు.

భారీ ఈదురుగాలులు గంటకు 60-70 కి.మీ. వీచే అవకాశం ఉన్నందున రహదారులపై చెట్లు కూలిపోతే వెంటనే తొలగించడానికి వుడ్ కటింగ్ మెషిన్లతో సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రమాదకరంగా ఉన్న వాగులు, కాజ్‌వేలు, రహదారుల వద్ద కాపలా ఏర్పాటు చేయాలని పోలీసు శాఖను ఆదేశించారు.

గ్రామాలు, పట్టణాల్లో ప్రమాదకరంగా ఉన్న పాత/శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి, అందులో నివసించే వారిని, ఒంటరిగా ఉన్న వృద్ధులను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు లేదా పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. వర్ష తీవ్రతను బట్టి పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించే అధికారాన్ని స్థానిక సీడీపీఓలు, ఎంఈఓలకు ఇస్తూ, ముందస్తుగా రాత్రి లేదా ఉదయాన్నే నిర్ణయం తీసుకుని విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చూడాలని స్పష్టం చేశారు.

అధికారులందరూ తమ హెడ్‌క్వార్టర్స్ అందుబాటులో ఉండాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి ప్రజలకు సహాయం అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

# తెలంగాణలో వడ్లకు రికార్డు ధర..

**తెలంగాణలో వడ్లకు రికార్డు స్థాయిలో ధరలు**

**కేశముద్రం మార్కెట్‌లో క్వింటాలు**

**జై శ్రీరామ్ వడ్లు రూ. 5,016సాగు తగ్గడం, పొరుగు రాష్ట్రాల నుంచి డిమాండ్ పెరగడమే కారణం**

**ప్రభుత్వ మద్దతు ధరను మించిపోవడంతో పౌరసరఫరాల శాఖకు సవాల్**

**రిటైల్ మార్కెట్‌లో కిలో బియ్యం ధర రూ. 100కు చేరిక**

మహబూబాబాద్ తెలంగాణ రైతులకు ఈ ఖరీఫ్ సీజన్ సిరుల పంట పండిస్తోంది. బహిరంగ మార్కెట్‌లో వరి ధాన్యానికి ఎన్నడూ లేనంత రికార్డు స్థాయిలో ధర లభిస్తోంది. మహబూబాబాద్ జిల్లా కేశముద్రం వ్యవసాయ మార్కెట్‌లో 'జై శ్రీరామ్' రకం వడ్లు ఏకంగా క్వింటాలుకు రూ. 5,016 పలికి ఆల్ టైమ్ రికార్డు సృష్టించాయి. రాష్ట్రవ్యాప్తంగా నల్గొండ, కరీంనగర్, ఖమ్మం వంటి జిల్లాల్లో సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు రూ. 3,000 నుంచి రూ. 3,500 వరకు ధర లభిస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ధరల పెరుగుదలకు కారణాలివే..: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు గతేడాదితో పోలిస్తే సుమారు 14 శాతం తగ్గడం, ఎల్ నినో ప్రభావం వంటి కారణాలతో దిగుబడిపై అంచనాలు మారాయి. ఇదే సమయంలో కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు వంటి పొరుగు రాష్ట్రాల నుంచి ప్రైవేట్ వ్యాపారులు, రైస్ మిల్లర్ల నుంచి భారీ డిమాండ్ ఏర్పడింది. కొందరు వ్యాపారులు రైతులకు అడ్వాన్సులు ఇచ్చి మరీ పంటను కొనుగోలు చేస్తుండ ˇటంతో బహిరంగ మార్కెట్‌లో పోటీ పెరిగింది. ఫలితంగా, ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రభుత్వానికి సవాల్.. వినియోగదారులపై భారం: ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్ ధర చాలా ఎక్కువగా ఉండటం గమనార్హం. ప్రభుత్వం ఏ-గ్రేడ్ వరి ధాన్యానికి క్వింటాలుకు రూ. 2,461 మద్దతు ధర ప్రకటించగా, ఎంపిక చేసిన 7 సన్న రకాలకు రూ. 500 బోనస్ ఇస్తోంది. దీంతో ప్రభుత్వానికి అమ్మితే రైతుకు గరిష్ఠంగా రూ. 2,961 లభిస్తుంది. అయితే, బహిరంగ మార్కెట్‌లో రూ. 3,500 ధర పలుకుతుండటంతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వైపు చూడటం లేదు. ఇది ప్రజా పంపిణీ వ్యవస్థ (ఖఊూ) కోసం సన్న బియ్యాన్ని సేకరించాలనుకుంటున్న ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది. మరోవైపు, ఈ ధరల పెరుగుదల ప్రభావం సామాన్య వినియోగదారులపై పడుతోంది. రిటైల్ మార్కెట్‌లో సన్న రకం బియ్యం కిలో ధర రూ. 90 నుంచి రూ. 100కి చేరింది. రైతుల హర్షం.. ప్రభుత్వ స్పందన: "వరికి ఒక్కసారిగా ఇంత ధర పెరుగుతుందని అనుకోలేదు. పెరిగిన ధరలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది" అని ఓ రైతు తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. కాగా, సన్న రకం బియ్యం ధరల పెరుగుదలకు ఎల్ నినో ప్రభావమే కారణమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గతంలో తాను సన్న రకం వరి సాగును ప్రోత్సహించినప్పుడు విమర్శలు వచ్చాయని, కానీ ఇప్పుడు దాని ప్రయోజనం రైతులకు అందుతోందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం 'జై శ్రీరామ్' రకంతో పాటు, ఆర్ఎన్ఆర్ వంటి ఇతర సన్న రకాలకు కూడా క్వింటాలుకు రూ. 4,300 వరకు ధర పలుకుతోంది. రాబోయే నవంబర్, డిసెంబర్ నెలల్లో పంట కోతలు పూర్తిస్థాయికి చేరిన తర్వాత ధరల తీరు ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది.

## ఉప్పాడ చేపల మార్కెట్‌లో విలసల సందడి..



ఉప్పాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడ జిల్లా కేంద్రానికి సమీపంలోగల ఉప్పాడ చేపల మార్కెట్‌లో సోమవారం విలస చేపలు సందడి చేశాయి. అత్యంత అరుదుగా లభించే ఈ చేపలను కొనుగోలు చేసేందుకు కస్టమర్లు పోటీపడ్డారు. దాంతో కిలో, కిలోన్నర బరువున్న ఒక్కోచేప రూ.1000 నుంచి రూ.1500 వరకు ధర పలికింది. మాకు పులస గురించి తెలుసుగానీ ఈ విలస ఏంది అనుకుంటున్నారా..? సముద్రంలో ఉన్నప్పుడు విలసగా పిలువబడే ఈ చేపలే.. సంతానోత్పత్తి కోసం గోదావరి నదిలో ఎదురీదుతూ పైకి వచ్చినప్పుడు పులసలుగా మారుతాయి. విలసగా ఉన్నప్పుడు కిలో రూ.1000 పలికే ఈ చేప ధర పులసగా మారిన తర్వాత రూ.20 వేల వరకు పలుకుతుంది. ఎందుకంటే విలసలే ఎంతో రుచిగా ఉంటాయంటే.. పులస చేపల రుచి అంతకంటే ఎన్నో రెట్లు రుచికరంగా ఉంటుంది. పులస రుచి గురించి తెలిసిన వాళ్లు అత్యంత అరుదుగా లభించే ఈ చేపను కొనుగోలు చేయడం కోసం డబ్బు గురించి ఎక్కువగా ఆలోచించరు. అయితే కొంతమంది విలస అన్నా, పులస అన్నా ఒకటే అని పొరపాటు పడుతుంటారు. కానీ విలస వేరు, పులస వేరు అని మత్స్యకారులు చెబుతున్నారు.

# జై భీమ్, జై రామ్' నినాదంతో ప్రజల్లోకి ఐ పి సి పార్టీ

**ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కె.బి. శ్రీధర్**

**సమాజంలో సామాజిక సామరస్యం, సమానత్వం, అన్ని వర్గాల సంక్షేమం లక్ష్యం**



హైద్రాబాద్ అక్టోబర్ 26;రామాలయం ఫౌండేషన్ అధ్యక్షురాలు పూనమ్ మిశ్రా ఆలోచన కులం, మతం మరియు సామాజిక వివక్షలకు అతీతంగా సమాజంలోని అన్ని వర్గాలను ఒకే తాటిపైకి తీసుకురావడం, సమగ్ర అభివృద్ధిని ప్రోత్సహించడం ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కె.బి. శ్రీధర్ చెప్పారు.

ఈ విస్తృత సామాజిక దృక్పథం నుంచి ప్రేరణ పొందిన ఇండియన్ ప్రజా కాంగ్రెస్ (ప్రజా)'జై భీమ్, జై రామ్' నినాదంతో ప్రజల్లోకి వెళ్లే ప్రణాళికను ప్రకటించారు. ఈ ప్రతిపాదిత ప్రచారం ద్వారా అణగారిన, వెనుకబడిన మరియు బలహీన వర్గాల్లో ఐక్యతను నెలకొల్పడంతో పాటు సామాజిక అవగాహన, రాజకీయ చైతన్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

పార్టీ ప్రకారం, ఈ కార్యక్రమం డా. బి.ఆర్. అంబేడ్కర్ మరియు డా. బాబు జగ్జీవన్ రామ్ సామాజిక న్యాయం, సమానత్వం మరియు అణగారిన వర్గాల అభ్యున్నతికి చేసిన కృషి నుంచి ప్రేరణ పొందింది. ఈ మహనీయుల ఆలోచనలను భగవాన్ రాముడి ఆదర్శాలతో అనుసంధానిస్తూ సమాజంలో పరస్పర గౌరవం, సమానత్వం మరియు సామాజిక ఐక్యతను బలోపేతం చేయడానికి ప్రయత్నం చేయనున్నారు.

రామాలయం ఫౌండేషన్ అధ్యక్షురాలు పూనమ్ మిశ్రా ఆలోచన సమాజంలోని ప్రతి వర్గం సంక్షేమం మరియు సమగ్ర సామాజిక వ్యవస్థ నిర్మాణంపై కేంద్రీకృతమై ఉంది. 'సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' అంటే అందరి సంక్షేమం, అందరి సంతోషం అనే భావన ఈ దృక్పథానికి మూలసారం. వివిధ వర్గాల మధ్య సామరస్యం, సహకారం మరియు సమిష్టి అభివృద్ధి భావనను ప్రోత్సహించడం దీని ఉద్దేశ్యం.

హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో ఉన్న లిబర్టీ ప్లాజాలో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడిన జాతీయ అధ్యక్షుడు కె.బి. శ్రీధర్, సమాజంలో ఐక్యత మరియు రాజకీయ అవగాహన పెంచేందుకు పార్టీ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తోందని తెలిపారు. డా. అంబేడ్కర్ మరియు డా. బాబు జగ్జీవన్ రామ్ చేసిన కృషిని స్మరించుకుంటూ, వారి ఆదర్శాలు అణగారిన వర్గాల సాధికారతకు ప్రేరణనిస్తాయని అన్నారు.

'జై భీమ్, జై రామ్' ప్రచారం ద్వారా సామాజిక న్యాయం, సమానత్వం మరియు సామాజిక సంక్షేమ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ భావిస్తోంది. ప్రజాస్వామ్య ప్రక్రియల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, వివిధ సామాజిక వర్గాల మధ్య సంభాషణను నెలకొల్పడం మరియు సమగ్ర అభివృద్ధి కోసం సమిష్టి కృషిని ప్రోత్సహించడంపైనా దృష్టి సారించనున్నారు.

ఈ ప్రతిపాదిత కార్యక్రమం యొక్క విస్తృత లక్ష్యం సామాజిక ఐక్యత, రాజకీయ చైతన్యం మరియు అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం. రామాలయం ఫౌండేషన్, ఢిల్లీ అధ్యక్షురాలు పూనమ్ మిశ్రా సమగ్ర దృష్టికోణం మరియు ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ప్రజా సంబంధాల ప్రణాళికను ఇదే దిశలో చేపడుతున్న ప్రయత్నంగా ప్రస్తావిస్తున్నారు..

# గురునానక్ మందిర్ కమాన్ ల నిర్మాణానికి భూమిపూజ చేసిన జగ్గారెడ్డి

**సంగారెడ్డి పట్టణం లోని గురునానక్ మందిర్‌ను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేసిన జగ్గారెడ్డి**

సంగారెడ్డి అక్టోబర్ 26;గత గురునానక్ జయంతి సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు సంగారెడ్డి పట్టణంలోని బ్రాహ్మణవాడలో రెండు కమాన్ల నిర్మాణానికి జగ్గారెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. గురునానక్ మందిర్‌కు వెళ్లే ప్రవేశ మార్గంలో ఒకటి, మందిర్‌కు సమీపంలోని భవాని మందిర్ రోడ్డులో మరొక కమాన్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.



అంతకుముందు గురునానక్ మందిర్‌ను సందర్శించిన జగ్గారెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మందిర్ ప్రతినిధులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వాటిని త్వరలో పరిష్కరిస్తానని జగ్గారెడ్డి హామీ ఇచ్చారు.

మందిర్ ప్రాంగణంలో రావిచెట్టు కింద ఉన్న నాగదేవత ఆలయాన్ని అభివృద్ధి చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్‌కు జగ్గారెడ్డి సూచించారు. ప్రస్తుతం ఉన్న విగ్రహాలను యథాస్థానంలోనే ఉంచి అభివృద్ధి పనులు చేపట్టాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సిక్కు ప్రముఖులు డాక్టర్ సర్దార్ సురేందర్ గోపి సింగ్, సర్దార్ తేజేందర్ సింగ్, సర్దార్ స్వరణ్ సింగ్, సర్దార్ సత్‌పాల్ సింగ్, డాక్టర్ సర్దార్ భరత్ సింగ్, సిక్కు గురువు గురుదేవ్ సింగ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్, నాయకులు బొంగుల రవి, కూన సంతోష్, మహేష్ ముదిరాజ్, శ్రీహరి, సుదీప్, నరేన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ అరెస్టు పేరిట వృద్ధురాలికి రూ.4 లక్షల టోకరా

**.(హెచ్. ప్రతాప్)**

చట్టపరమైన చర్యల పేరుతో అమాయకులను భయభ్రాంతులకు గురిచేస్తున్న సైబర్ నేరగాళ్లు మరో వృద్ధురాలిని మోసగించారు. హైదరాబాద్‌కు చెందిన 73 ఏళ్ల విశ్రాంత ఉద్యోగినిని మనీలాండరింగ్ కేసులో ఇరికిస్తామంటూ బెదిరించి, దాదాపు పది రోజులపాటు డిజిటల్ అరెస్టు పేరిట మానసిక ఒత్తిడికి గురిచేశారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ పేర్లను దుర్వినియోగం చేస్తూ రూ.4 లక్షలు కాజేసినట్లు బాధితురాలు ఫిర్యాదు చేశారు.

బాధితురాలి కథనం ప్రకారం, సెప్టెంబర్ చివరి వారంలో గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి, భారత డేటా ప్రొటెక్షన్ బోర్డు అధికారినని పరిచయం చేసుకున్నాడు. అనంతరం రవి అనే వ్యక్తికి కాల్ అనుసంధానించాడు. అతడు వాట్సాప్ వీడియో కాల్స్ ద్వారా మాట్లాడుతూ, ఆమెపై తీవ్రమైన నేరారోపణలు ఉన్నాయని నమ్మించాడు.

నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా సంస్థతో సంబంధాలున్నాయని, ఆ సంస్థ నుంచి రూ.2.5 కోట్లు అందుకున్నారని ఆరోపించాడు. మహారాష్ట్రలోని నాసిక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని, విచారణకు సహకరించకపోతే అరెస్టు తప్పదని హెచ్చరించాడు. ఈ ఆరోపణలన్నీ నేరగాళ్లు సృష్టించినవేనని బాధితురాలు పేర్కొన్నారు.

ఆమెపై మానసిక ఒత్తిడి పెంచేందుకు ఇంటి తలుపులు, కిటికీలు మూసివేయాలని, భర్తతో సహా ఎవరికీ విషయం చెప్పరాదని ఆదేశించారు. నిరంతర వీడియో కాల్స్, అరెస్టు బెదిరింపులతో భయాందోళనలకు గురిచేశారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో విచారణ జరుగుతోందని నమ్మించారు.

చివరకు దర్యాప్తులో భాగంగా భద్రతా డిపాజిట్ చెల్లించాలంటూ రూ.4 లక్షలు బదిలీ చేయించారు. విచారణ పూర్తయ్యాక నగదు తిరిగి అందుతుందని హామీ ఇచ్చారు. అనంతరం మోసాన్ని గుర్తించిన బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు.

భారతదేశంలో డిజిటల్ అరెస్టు అనే చట్టబద్ధమైన విధానం లేదని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వ దర్యాప్తు సంస్థలేవీ వీడియో కాల్స్ ద్వారా నగదు బదిలీ చేయాలని కోరవు. నేరగాళ్లు అధికారుల పేర్లు, నకిలీ గుర్తింపులు, అరెస్టు బెదిరింపులతో ప్రజలలో భయాన్ని సృష్టిస్తున్నారు.

ముఖ్యంగా వృద్ధుల అమాయకత్వాన్ని, చట్టపరమైన వ్యవహారాలపై వారికున్న భయాన్ని అవకాశంగా మలుచుకుంటున్నారు. ఇటువంటి కాల్స్ వచ్చినప్పుడు కుటుంబ సభ్యులకు తెలియజేయడంతోపాటు పోలీసులను సంప్రదించాలి. బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీలు వెల్లడించరాదు. నగదు బదిలీ జరిగితే వెంటనే 1930 సైబర్ నేరాల సహాయ సంఖ్యకు ఫిర్యాదు చేయాలి.

డిజిటల్ సాంకేతికత విస్తరిస్తున్న నేపథ్యంలో సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన పెంపొందించడం అత్యవసరం. కుటుంబ సభ్యులు వృద్ధులకు ఇటువంటి మోసాల పద్ధతులను వివరించాలి. అపరిచితుల బెదిరింపులకు లొంగకుండా అధికారిక మార్గాల్లో నిజానిజాలు నిర్ధారించుకోవాలి. వ్యక్తిగత సమాచార రక్షణతోపాటు సకాలంలో ఫిర్యాదు చేయడమే ఆర్థిక నష్టాలను నివారించేందుకు సమర్థమైన మార్గం.

# ఉమెన్ ఎక్స్ క్లూస్ 2026 అవార్డ్స్ ప్రదానం







వరంగల్అక్టోబర్26 ;E6TV చానల్ ఆధ్వర్యంలో ఉమెన్ ఎక్స్ క్లూస్ 2026 అవార్డ్స్ ప్రదానొత్సవం జిల్లా రమేష్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి జిల్లా కలెక్టర్ సత్య శారద విచ్చేసి అవార్డులను ప్రదానం చేశారు.ఈ సందర్భంగాహోమియోపతి డాక్టర్ బొమ్మ రవి బొమ్మ భాస్కర్ లను రాజనాల శ్రీహరి ఘనంగా సన్మానించారు.అలాగే ఉత్తమ సేవలు డాక్టర్స్ ను మున్సిపాలిటీ సిబ్బందిలను సన్మానించినారు .ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పోలె పాక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవాలి

**టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు నాయుడు**



అమరావతి, అక్టోబర్ 26 స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకోవాలని పార్టీ అగ్రనేతలకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో లభించిన అద్భుత విజయం తర్వాత.. ఇచ్చిన హామీలను నెరవె?రుస్తూ వస్తున్నామని అన్నారు. అందుకే 'చెప్పాం-చేస్తున్నాం' కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రచారాన్ని మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. సోమవారం ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలతో సీఎం చంద్రబాబు నాయుడు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలపై వారికి దిశానిర్దేశం చేశారు.మిత్రధర్మాన్ని పాటించి తీరాల్సిందేనని.. అందులో ఎలాంటి వెసులుబాటూ లేదని ఈ సందర్భంగా వారికి సీఎం చంద్రబాబు తేల్చి చెప్పారు. 2024 తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల వేళ ప్రచారానికి ప్రజల వద్దకు వెళ్తున్నామని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్రం, స్థానికంగా.. ఇలా మూడు స్థాయిల్లోనూ ఒకే ప్రభుత్వం ఉంటే కలిగే లాభాలను ప్రజలకు వివరించాలని సోదాహరణతో వివరించారు. అగ్రనేతలు మొదలుకుని.. కార్యకర్త వరకు చేసే పనిని రికార్డ్ చేస్తున్నామని తెలిపారు. పొత్తులు, రిజర్వేషన్ల కారణంతోపాటు సోషల్ రీ-ఇంజనీరింగ్‌లో భాగంగా కొంత మందికి అవకాశాలు దక్కలేదని వివరించారు. రాష్ట్రం, పార్టీ కోసం పని చేసిన వారికి గుర్తింపునిస్తామని.. వారిని నామినేటెడ్ పదవులతో గౌరవిస్తామని చెప్పారు.కూటమి అధికారంలోకి వచ్చాక పెద్ద ఎత్తున సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను సులభతరం చేస్తూ సుపరిపాలన అందిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి వర్గానికీ.. ప్రతి ప్రాంతానికీ లబ్ధి చేకూర్చేలా పాలన సాగిస్తున్నామని పేర్కొన్నారు. రికార్డులు సృష్టించేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చాక చేపట్టిన మంచి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సి ఉందని వారికి వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు న్యాయం చేశామని.. చిన్న కులాలకు కూడా ప్రాధాన్యతనిచ్చామని సీఎం చంద్రబాబు చెప్పారు. పాలనలో తామూ భాగస్వాములమనే సంతృప్తి ప్రతి ఒక్క వర్గానికి కలగాలని అన్నారు. ప్రభుత్వానికి.. ప్రజలకు కూటమి పార్టీల కార్యకర్తలే వారధిగా నిలవాలని స్పష్టం చేశారు. కూటమి పార్టీలు చక్కటి సమన్వయంతో క్షేత్ర స్థాయిలో పని చేయాలని ఆదేశించారు.

# కమలంలో కలవరం...

విశాఖపట్టణం, అక్టోబరు 26, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి భయం పట్టుకుంది. మూడు పార్టీల మధ్య సమన్వయం కుదురుతుందా? అన్నది వారి భయానికి కారణం. ఎందుకంటే గత శాసనసభ ఎన్నికల్లో తమ సీట్లను పొత్తులో భాగంగా తీసుకున్నారని పలు చోట్ల టీడీపీ నేతలు గుర్రుగా ఉన్నారు. దీంతో ఈ ఎన్నికల్లో వాళ్లు రివెంజ్ తీసుకుంటారేమోనన్న ఆందోళన బీజేపీ నేతల్లో స్పష్టంగా కనిపిస్తుంది. అనేక నియోజకవర్గాల్లో బీజేపీకి, టీడీపీ నేతలకు మధ్య సయోధ్య లేకపోవడంతో ఈ అనుమానాలకు ప్రధాన కారణంగా చూడాలి.అయితే స్థానిక సంస్థల ఎన్నికలలోనూ పొత్తులో భాగంగా తమ సీట్లలో కమలం పార్టీ వాళ్లు వచ్చి కూర్చున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. బీజేపీకి ఆంధ్రప్రదేశ్ లో ఓటు బ్యాంకు తక్కువే. టీడీపీ, జనసేనలపైనే ఆధారపడి గెలవాల్సి ఉంటుంది. ఒక ఉదాహరణ చూస్తే బీజేపీ నేతలు కూడా అలాగే ఉన్నారు. కోస్తా జిల్లాకు చెందిన ఒక బీజేపీ శాసనసభ్యుడు వైసీపీ నుంచి వచ్చిన వారిని నేరుగా టీడీపీలోకి పంపడం ఈ సందర్భంగా కొందరు గుర్తు చేసుకుని మరీ ఆందోళన చెందుతున్నారు. కూటమిగా పోటీ చేస్తున్నప్పటికీ ఎక్కడో లోపల బ్యాక్ స్టాబింగ్ జరుగుతుందన్న ఆందోళన మాత్రం నెలకొని ఉంది. ఆంధ్రప్రదేశ్ జరుగుతున్న పట్టణ, స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు కలిసి కూటమిగా పోటీ చేస్తున్నాయి.బీజేపీ ఇటీవల తన అభ్యర్థుల తొలి జాబితాను కూడా విడుదల చేసింది అనంతపురం మేయర్ అభ్యర్థిగా కోట్ల అజేష్ బాబు సహా పలు మున్సిపల్ చైర్‌పర్సన్ స్థానాలకు పేర్లు ఖరారు చేసింది. కానీ ఓట్ల బదిలీ అనేది ఈ ఎన్నికల్లో ప్రధాన అంశంగా మారనుంది. ఇప్పుడు పదవి బీజేపీకి అప్పగిస్తే భవిష్యత్ లో ఇదే స్థానాన్ని బీజేపీ కోరుకునే అవకాశముందని కూడా టీడీపీ నేతలు ఆందోళన చెందుతున్నారు. అందుకే ఈ ఎన్నికల్లో సహాయ నిరాకరణ చేస్తారని, ప్రచారంలో నేతలు పాల్గొన్నా ఓటు బ్యాంకు తమకు బదిలీ కావడంపై అనేక సందేహాలను బీజేపీ రాష్ట్ర నేతలే వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ విషయాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. అయితే స్థానికంగా ఉన్న నేతలను సమన్వయం చేసుకుని వెళ్లాలని చంద్రబాబు సూచించినట్లు తెలిసింది.... జిల్లా, నియోజకవర్గాల స్థాయిలో ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీలు కూడా ఎంత మాత్రం తమకు అనుకూలంగా ఓట్లు వచ్చే విధంగా వ్యవహరిస్తారన్న అనుమానాలను కమలనాధులను పట్టిపీడిస్తున్నాయి. అయితే ఎవరికీ చెప్పుకోలేని బాధ. పార్టీ అగ్రనాయకత్వం మాత్రం పార్టీ పట్ల అనుకూలంగానే ఉంది. కానీ టీడీపీలోని కింది స్థాయి నాయకులు మమాత్రం కలసి రావడం లేదు. శాసనసభ ఎన్నికలు వేరు. స్థానిక సంస్థల పోరు వేరు. రేపు పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ కార్యకర్తలు ఏ మాత్రం తమతో కలసి వస్తారన్న దానిపై కూడా అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బీజేపీ నాయకత్వం కేవలం కూటమిలో పొత్తులో భాగంగా సీట్లు తెచ్చుకోవడంతో సరిపోదు. రేపు పోటీ చేసిన చోట్ల విజయం దక్కకపోతే అది బీజేపీ నేతల వైఫల్యంగానే చూస్తారు. టీడీపీ రాష్ట్ర నాయకత్వంలో మాత్రం కూటమిలోనూ అన్ని పార్టీలు వంద శాతం స్ట్రయిక్ రేట్ సాధించాలని భావిస్తుంది. ఒకవేళ అది రాకపోతే ప్రత్యర్థులకు బలం ఇచ్చినట్లవుతుంది.

# ఎస్ఐఆర్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి.

## ఓటరు దరఖాస్తుల పరిష్కారం, రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి.

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి.

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 26 ములుగు**సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఐఆర్--2026 కార్యక్రమంపై సమీక్షించారు.




ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ములుగు సమీకృత కలెక్టరేట్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు హాజరయ్యారు.



ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎస్ఐఆర్‌కు సంబంధించిన అన్ని నోటీసులపై ప్రక్రియను వచ్చే వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనర్హులుగా గుర్తించిన ఓటర్ల జాబితాకు సంబంధించిన వివరాలను తగిన ఆధారాలతో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. ఎస్ఐఆర్‌లో తిరస్కరణ కేసులకు సంబంధించి, తిరస్కరణకు గల కారణాలను స్పష్టంగా పేర్కొంటూ తప్పనిసరిగా స్పీకింగ్ ఆర్డర్ జారీ చేయాలని ఆదేశించారు.

ఫారం--6, ఫారం--7, ఫారం--8 దరఖాస్తులను నవంబర్ 5లోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. బూత్‌స్థాయి అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు తమ కార్యాలయాల్లో ఎస్ఐఆర్--2026కు సంబంధించిన రికార్డులను పకడ్బందీగా నిర్వహించి భద్రపరచాలని ఆదేశించారు.

శాసనమండలి నియోజకవర్గ ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని సూచించారు. ఫారం--18 దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని తెలిపారు.

శాసనమండలి ఎన్నికలకు సంబంధించిన నివేదికను పత్రికలు, ప్రసార మాధ్యమాలకు అందించాలని సూచించారు. సహాయ ఎన్నికల నమోదు అధికారులు, నియమిత అధికారుల కార్యాలయాల్లోని నోటీసు బోర్డులపై ఆ నివేదికను ప్రదర్శించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో ఆర్డీవో కృష్ణవేణి, ఎన్నికల సెక్షన్ సిబ్బంది సలీం, నితీష్, సీనియర్ అసిస్టెంట్,
సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తుపాకీతో బెదిరించి దోపిడీ.. సరిహద్దుల్లో పోలీసుల వేట!

## సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలన




**జహీరాబాద్, అక్టోబర్ 26 ప్రజాబలం ప్రతినిధి :** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం చింతలాఘాట్ గ్రామ సమీపంలో తుపాకీతో బెదిరించి బంగారం దోచుకున్న ఘటన కలకలం రేపింది. హైదరాబాదు కారులో వెళ్తున్న వారిని సోమవారం తెల్లవారుజామున బైక్పై వచ్చిన గుర్తుతెలియని దుండగులు అడ్డగించి, తుపాకీతో బెదిరించి వారి వద్ద ఉన్న సుమారు మూడు తులాల బంగారాన్ని దోచుకొని పరారయ్యారు. దోపిడీకి గురైన బాధితులు వెంటనే 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కోహీర్ పోలీసులు అప్రమత్తమై ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను పట్టుకునేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. బీదర్, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నారు. బాధితులు ప్రయాణిస్తున్న కారును దుండగులు ఎక్కడి నుంచి అనుసరించారు? ముందస్తు రెక్కీ నిర్వహించారా? అనే కోణాల్లోనూ విచారణ చేపట్టారు. ఈ దోపిడీలో ముగ్గురు దుండగులు పాల్గొన్నట్లు సమాచారం. నిందితులను గుర్తించి పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# పంచలింగాల్ కిట్టు, లక్షిత్ రెడ్డి పుట్టినరోజు కార్యక్రమంలో పాల్గొన్న మాజీ గ్రంథాలయ సమస్త చైర్మన్ కొండల్ రెడ్డి






**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 26(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పంచలింగాల్ గ్రామంలో సన్న గారి కుటుంబంలో బర్త్డే సందడి సన గారి కిట్టు, లక్షిత్ రెడ్డి బర్త్ డే కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించిన ఎస్కేఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు వికారాబాద్ మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ కొండల్ రెడ్డి లక్షిత్ రెడ్డి,నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో విద్యా యందునుబుద్ధి యందును జ్ఞానమందును వర్ధిల్లాలని నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆశీర్వదించినట్లు తెలిపారు

# 16 ఏళ్ల భూ సమస్యకు పరిష్కారం

## ఆర్డీఓ, తహసీల్దార్‌కు రైతు నాగమ్మ సన్మానం




**జహీరాబాద్, అక్టోబర్ 26 ప్రజాబలం ప్రతినిధి:** భూ రికార్డుల్లో పేరును నమోదు చేయించుకునేందుకు 16 ఏళ్లుగా ఎదురుచూస్తున్న బూర్దిపాడ్ గ్రామానికి చెందిన ఒగ్గు నాగమ్మ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. జహీరాబాద్ మండలం బూర్దిపాడ్ గ్రామ శివారులోని సర్వే నంబరు 82/9లో ఉన్న 1.05 ఎకరాల భూమి సమస్యను అధికారులు పరిష్కరించడంతో నాగమ్మ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం జహీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ దేవుజ నాయక్, తహసీల్దార్ పి.దశరథ్‌లను శాలువాలు, పూలమాలలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

ఆన్‌లైన్ రికార్డుల్లో గల్లంతు

నాగమ్మ భర్త మాణేప్ప తండ్రి పెంటప్పకు సర్వే నంబరు 82/9లోని 1.05 ఎకరాల భూమికి అసైన్‌మెంట్ పట్టా లభించింది. అప్పటి నుంచి వారు భూమిని సాగు చేసుకుంటున్నారు. 2010-11 పహణీ వరకు రికార్డుల్లో వారి పేరు నమోదై ఉంది. ఆ తర్వాత ఆన్‌లైన్ పహణీ రికార్డుల్లో పొరపాటున పేరు నమోదు కాకపోవడంతో సమస్య మొదలైంది. రికార్డుల్లో పేరు నమోదు చేయించాలని పలుమార్లు దరఖాస్తు చేసినా ఫలితం లేకపోయింది.

భూ భారతి ద్వారా పరిష్కారం

ఈ సమస్యపై ఆగస్టు 25న తహసీల్దార్ పి.దశరథ్‌ను నాగమ్మ సంప్రదించారు. భూ భారతి పోర్టల్‌లోని టీఎం-33 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. దీంతో సెప్టెంబరు 24న దరఖాస్తు చేసుకోగా, అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలించి నివేదికను ఆర్డీఓకు సమర్పించారు. అనంతరం ఆమోదం లభించడంతో భూ సమస్య పరిష్కారమైంది. 16 ఏళ్ల నిరీక్షణకు తెరపడటంతో నాగమ్మ ఆనందం వ్యక్తం చేశారు.

# మా సమస్యల పరిష్కారమయ్యే వరకు సమ్మె ఆగదు

## జాతీయ ఆరోగ్య మిషన్ , జిల్లా ఇన్చార్జి జేపీసీ డాక్టర్ నరహరి

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 26 ములుగు**తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె ఈరోజు కు 14 రోజులు ముగిసింది మా సమస్యలను తెలంగాణ ప్రభుత్వం పరిష్కరించేంత వరకు నిరవాదిక సమ్మె కొనసాగుతూనే ఉంటుంది ముఖ్యంగా జాతీయ ఆరోగ్య మిషన్లో పని చేస్తున్నటువంటి అన్ని శాఖల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని అలాగే 60 జీవోను వెంటనే.




అమలు చేయాలని అన్ని క్యాడర్లో ఉద్యోగులకు జీతాలను పెంచాలని ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి వారి సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతూ మహిళలకు 180 రోజులు వేతనంతోకూడిన ప్రసూతి సెలవులు ప్రకటించాలని ఎన్ హెచ్ ఎం కాంట్రాక్టులో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరికి ఒకటవ తారీఖున శాలరీస్ చెల్లించాలని మధ్య దళారులకు కాంటాక్ట్ పద్ధతిన ఇవ్వవద్దని వారు అన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం మా సమస్యలను అర్థం చేసుకొని మాకు ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వానికి తెలియజేస్తున్నాము ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం పనిచేస్తున్న అన్ని క్యాడర్ల ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు

# భద్రాచలంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు






**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 26:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భద్రాచలం పట్టణంలో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ శరత్ తన బృందంతో కలిసి వివిధ హోటళ్లు, ఆహార విక్రయ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, నిల్వ విధానాలు మరియు ఆహార భద్రతా ప్రమాణాల అమలును పరిశీలించారు. తనిఖీల సందర్భంగా నిబంధనల ఉల్లంఘనలు గుర్తించిన ఒక దుకాణాన్ని సీజ్ చేయడంతో పాటు, తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు కార్యకలాపాలు నిలిపివేయాలని సస్పెన్షన్ నోటీసు జారీ చేశారు. అలాగే, పరిశుభ్రత లోపాలు మరియు ఇతర ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘనలు గుర్తించిన 3 హోటళ్లకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేసి, లోపాలను నిర్దేశిత సమయంలో సరిదిద్దుకోవాలని ఆదేశించారు.

తనిఖీలలో భాగంగా వివిధ ఆహార పదార్థాలకు సంబంధించి 7 నమూనాలను సేకరించి (లిఫ్ట్ చేసి) పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపేందుకు చర్యలు చేపట్టారు.

ఆహార వ్యాపారులు తప్పనిసరిగా ఆహార భద్రతా ప్రమాణాలను పాటించాలని, పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ వినియోగదారులకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

# డ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

## ఎన్నికల వ్యూహాలపై నాయకులతో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ సమావేశం

మహబూబాబాద్: మహబూబాబాద్‌లోని మాజీ ఎమ్మెల్యే బాణోత్ శంకర్ నాయక్ కార్యాలయంలో నేడు మాజీ మంత్రి, వరంగల్?నల్గొండ?ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల మహబూబాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీమతి సత్యవతి రాథోడ్ పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రానున్న వరంగల్?నల్గొండ?ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ నమోదు ప్రక్రియ, అర్హులైన పట్టభద్రులను గుర్తించడం, ఓటరు జాబితాలో వారి పేర్లు నమోదు అయ్యేలా తీసుకోవాల్సిన చర్యలు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించారు. గ్రాడ్యుయేట్ ఓటర్ నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని, పట్టభద్రులకు ఓటు నమోదు ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా తమ పేర్లను నమోదు చేసుకునేలా నాయకులు చొరవ చూపాలని సమావేశంలో చర్చించారు. అలాగే నియోజకవర్గంలోని మండలాలు, గ్రామాలు, పట్టణ ప్రాంతాల వారీగా ఓటర్ నమోదు పరిస్థితిని సమీక్షిస్తూ, పార్టీ నాయకులు పరస్పర సమన్వయంతో పనిచేయడం, నమోదు ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయడం, రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అనుసరించాల్సిన వ్యూహాలను రూపొందించుకోవడంపై ప్రధానంగా చర్చించారు.

# హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో ఘనంగా శంభాలా 360 సొల్యూషన్స్ ప్రారంభోత్సవం




హైదరాబాద్ । అక్టోబర్ 25, 2026 రాజకీయ, సినీ, పరిశోధన, సామాజిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖుల సమక్షంలో హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో ఈరోజు శంభాలా 360 సొల్యూషన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమానికి శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ప్రత్యేక అతిథులుగా ప్రముఖ సినీ నటీమణులు శ్రీమతి చల్లా జయలలిత, శ్రీమతి మంజు భార్గవి, ప్రముఖ సినీ నటుడు శ్రీ శివకృష్ణ, సినీ దర్శకుడు శ్రీ ఎన్. శంకర్, నారీ శక్తి ఫోరం వ్యవస్థాపకులు డాక్టర్ మొహమ్మద్ నిజాముద్దీన్, డాక్టర్ వెంకట కె. గంజాం (జీకే) పాల్గొన్నారు.

చైతన్య పరిశోధకులు, ఎనర్జీ సైంటిస్ట్ డాక్టర్ కె. హరి హర నాధ రాజు, శ్రీ వీశం సాయిదేవ్ ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించి, శంభాలా 360 సొల్యూషన్స్ లక్ష్యాలు, ఆశయాలు, భవిష్యత్ ప్రణాళికలను వివరించారు.

ఈ సందర్భంగా పలు నూతన ఉత్పత్తులు, ప్రచురణలు, డిజిటల్ సేవలను ప్రారంభించారు. ముఖ్యంగా శంభాలా ఆస్ట్రో -- PEMF (పల్స్ ఎలక్ట్రోమాగ్నెటిక్ ఫీల్డ్) చైతన్య ఫ్రీక్వెన్సీ పరికరం, శంభాలా పిల్లో, సీట్ మ్యాట్రెస్, శంభాలా భగవద్గీత మహాగ్రంథం మరియు మరో ఎనిమిది మహాగ్రంథాలు, శంభాలా ఆహార ఉత్పత్తులు, ఆండ్రాయిడ్ మరియు ఐఓఎస్ ప్లాట్‌ఫారమ్‌ల కోసం రూపొందించిన శంభాలా 360 సొల్యూషన్స్ మొబైల్ అప్లికేషన్ ప్రారంభించబడ్డాయి.

చైతన్య పరిశోధన, ఎనర్జీ సైన్స్, ఆధ్యాత్మిక సాహిత్యం, వినియోగదారుల ఉత్పత్తులు, డిజిటల్ సేవలను ఒకే వేదికపైకి తీసుకురావడమే శంభాలా 360 సొల్యూషన్స్ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ అతిథులు సంస్థ బృందానికి అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

పరిశోధన, విజ్ఞాన వ్యాప్తి, నూతన ఆవిష్కరణల ద్వారా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను విస్తృతం చేసే దిశగా శంభాలా 360 సొల్యూషన్స్ ప్రారంభోత్సవం ఒక ముఖ్యమైన ముందడుగు అని నిర్వాహకులు పేర్కొన్నారు.

# నీటిని వృథా చేస్తే ప్రజలకు దండన, అధికారుల తప్పిదాలకు ఏమీ దండన ?

**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 26 అక్టోబర్ 2026**దాహమొ రామచంద్ర అనే ప్రస్తుత పరిస్థితుల్లో నీటిని వృథా చేస్తే దండిస్తామని జరిమానాలు విధిస్తామని ఢాంబికాలు పలికే ప్రభుత్వ అధికారులలారా భాగ్యనగర వాసుల దప్పిక తీర్చడానికి గండిపేట జలాశయం నుండి మీరాలం ట్యాంక్ వరకు గురుత్వాకర్షణ శక్తి ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన కాండిడ్ లైన్ మరమ్మతులకు నోచుకోక నీటి లీకేజీలు ఉన్న విషయం అధికారులకు పలు మార్లు పిర్యాదు చేసినను చెవిటొాడి ముందు శంఖారావం ఊధినట్లు ఉలుకూ పలుకూ లేకుండా మనుగడ సాదించడం సంబంధిత అధికారుల ప్రత్యేకత, మణికొండ గవర్నమెంట్ ప్రభుత్వ పాఠశాల ఎదురుగా కాండిడ్ లైన్ నుండి లీకేజీ కారణంగా నీరు వృథా అవుతోందని అందుకు ఎవరు కారణబూతులో, ఎవరిని దండిస్తారొ ప్రజలకు జవాబు చెప్పాలని భారత రాష్ట్ర సమితి పార్టీ సీనియర్ నాయకుడు అందె లక్ష్మణ్ రావు డిమాండ్ చేస్తున్నాడు. వాస్తవానికి పసిఫిక్ మహాసముద్రంలో సముద్రపు నీటి ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం వల్ల ఎల్ నినో ప్రభావం రీత్యా వాతావరణ మార్పుతో ఎండల తీవ్రత పెరిగి, ఉన్న నీరు వేగంగా ఆవిరై పోతుందని తత్ ఫలితంగా వర్షపాతం తగ్గడం, నైరుతి రుతుపవనాలు బలహీనపడి, సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవు తుందని శాస్త్రవేత్తలు పదే పదే హెచ్చరించినను కాంగ్రెస్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం పరాకాష్ట కాగా, పై పెట్బ్బా సొయిా లేకుండా కృష్ణ, గోదావరి నదీ జలాలను కాపడకుండా, నదీ పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గడం వల్ల శ్రీశైలం, తుంగభద్ర వంటి ప్రాజెక్టులు మరియు జలాశయాలు పూర్తి స్థాయిలో నిండనందున తీవ్రమైన నీటి సంక్షోభం ఏర్పడి భూగర్భ జలాలు అడుగంటి పోయి, తాగునీటికీ, సాగునీటికీ తీవ్రమైన కొరత ఏర్పడు తుందని తెలిసి గమ్మున ఉండడం ఈ దద్దమ్మ ప్రభుత్వం చేతగాని తనమే.

## మర్పల్లి పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి కొంషేడ్పల్లి మన్నే సుధాకర్ యాదవ్,తెలిపారు



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి అక్టోబర్ 26(ప్రజా బలం) వికారాబాద్ జిల్లా:**మర్పల్లి మండలం అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరుగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలనీ కొంసేడ్పల్లి మన్నే సుధాకర్ యాదవ్,పిలుపునిచ్చారు.పట్టభద్రుల ఓటరు నమోదు, అవగాహన కార్యక్రమం గురించిమాట్లాడారుహైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లను పట్టభద్రుల ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు.పట్టభద్రుల నియోజకవర్గ ఓటరుగా నమోదుకు ఎన్నికల నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారు ఫారం--18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సాధారణంగా సంబంధిత అర్హత తేదీకి కనీసం మూడు సంవత్సరాల ముందు డిగ్రీ లేదా సమానమైన అర్హత పొందిన వారు సంబంధిత నియోజకవర్గంలో సాధారణ నివాసితులై ఉంటే పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితాలో నమోదు చేసుకునే అర్హత కలిగి ఉంటారని అన్నారు .మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టభద్రులను గుర్తించి, వారికి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని కోరారు పట్టభద్రుడు ఓటరు నమోదుకు దూరం కాకుండా గ్రామాల వారీగా ప్రత్యేక దృష్టి పెట్టి యువత నమోదు కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలోసారించాలని కొంషేడ్పల్లి మన్నెసుధాకర్ యాదవ్ తెలిపారు సూచించారు.

# మహిళా కబడ్డీకి సత్తుపల్లి వేదిక.. 28 నుంచి రాష్ట్రస్థాయి పోటీలు!

### అక్టోబర్ 28 నుంచి 30 వరకు 73వ రాష్ట్రస్థాయి పోటీలు
### మంత్రి పొంగులేటి జన్మదినం సందర్భంగా మువ్వా యూత్ ఆధ్వర్యంలో నిర్వహణ..

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 26 :** రాష్ట్ర క్రీడా రంగంలో మహిళా క్రీడాకారిణుల ప్రతిభను చాటిచెప్పేలా సత్తుపల్లిలో 73వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల కబడ్డీ పోటీలకు రంగం సిద్ధమైంది. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని, మాజీ టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు ఆధ్వర్యంలో మువ్వా యూత్ సత్తుపల్లి ఈ పోటీలను నిర్వహించనుంది. అక్టోబర్ 28, 29, 30 తేదీల్లో సత్తుపల్లిలోని రాణి సెలబ్రేషన్స్‌లో మూడు రోజుల పాటు ఈ టోర్నమెంట్ జరగనుంది.





ఈ రాష్ట్రస్థాయి పోటీల్లో తెలంగాణలోని వివిధ జిల్లాలకు చెందిన మహిళా కబడ్డీ జట్లు పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నాయి. మహిళల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు, వారికి రాష్ట్రస్థాయిలో సత్తా చాటుకునే అవకాశం కల్పించడం, యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడం లక్ష్యంగా నిర్వాహకులు ఈ పోటీలను చేపడుతున్నారు.

మహిళా క్రీడాకారిణులను ప్రోత్సహించడం ద్వారా వారు క్రీడారంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ఈ టోర్నమెంట్ దోహదపడుతుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. మూడు రోజుల పాటు హోరాహోరీగా సాగనున్న కబడ్డీ పోటీలను తిలకించేందుకు క్రీడాభిమానులు, యువత, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి పట్టణ కౌన్సిలర్లు తోట సుజలారాణి, మట్టా ప్రసాద్, బేతుపల్లి గ్రామ సర్పంచ్ దొడ్డా రాజేంద్రప్రసాద్ (అమ్ములు), కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మువ్వా విజయబాబు అభిమాను

# ఓటు హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ పిలుపు ఢిల్లీలో నవంబరు 1న భారీ నిరసన ర్యాలీ

**జహీరాబాద్, అక్టోబర్ 26 ప్రజాబలం ప్రతినిధి:** ఓటర్ల జాబితాలో తప్పులను సరిదిద్ది, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ఏ. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంపీ కార్యాలయంలో నిర్వహించిన 'ఓట్ బచావ్--దేశ్ బచావ్' హక్కుల పరిరక్షణ కార్యక్రమంలో ఏఐసీసీ పరిశీలకుడు సరల్ పటేల్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ నాగరిగారి ప్రీతం, డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డితో కలిసి నాయకులు ఈ అంశంపై చర్చించారు.



ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది

ఎస్ఐఆర్ సర్వేలో భాగంగా ఓటర్ల జాబితా నుంచి తొలగించినట్లు గుర్తించిన ఓట్ల అంశంపై చర్చించారు. అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటు హక్కును పరిరక్షించడం, ఓటర్ల జాబితాలోని తప్పులను సరిచేయడం, ప్రజాస్వామ్య విలువలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

ఢిల్లీలో నిరసన ర్యాలీకి పిలుపు

ఓటు హక్కుల పరిరక్షణ కోసం నవంబరు 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని ఓటు హక్కుల పరిరక్షణకు తమ గళాన్ని వినిపించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కో-ఆర్డినేటర్ మహమ్మద్ గౌస్, ఆత్మ కమిటీ ఛైర్మన్ రామలింగారెడ్డి, మండల అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, సువర్ణ, మల్లన్న పాటిల్, పవన్ రాథోడ్, ఉదయ్ శంకర్ పాటిల్, కోహీర్ పట్టణ అధ్యక్షుడు ముజాఫర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్షద్ అలీ, సామెల్, మాజీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మక్సూద్ అహ్మద్, మాజీ పట్టణ అధ్యక్షుడు కండెం నర్సింలు, శంషీర్ అలీ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా తబస్సుమ్, కౌన్సిలర్ మహేష్ కుమార్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యల నివారణకు ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 26 ఏటూరునాగారం** ఏటూరునాగారం, మండల పరిధిలోని శంకరాజుపల్లి, ముల్లెకట్ట గ్రామాల్లో ఎదురవుతున్న విద్యుత్ ఓవర్ లోడ్, లో-వోల్టేజ్ సమస్యలకు పరిష్కారం గా విద్యుత్ శాఖ అధికారులు అదనపు నూతన ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేసి చార్జ్ చేశారు. నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా శాఖ ఉన్నతాధికారుల సూచనల మేరకు ఈ పనులను శరవేగంగా పూర్తి చేశారు.

ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ బిక్షపతి, డీఈ పురుషోత్తం, ఏడీఈ ఉమారావు, ఏఈ పండ్ల శేఖర్, లైన్ ఇన్స్పెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## వరిగుంతం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉపేందర్ గౌడ్

**కొల్చారం, అక్టోబర్ 26 (ప్రజాబలం): ప్రతినిధి**మెదక్ జిల్లా కొల్చారం మండలం వరిగుంతం గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా జోగిపేట ఉపేందర్ గౌడ్ , ఉపాధ్యక్షుడిగా అచ్చనపల్లి శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా ముత్యాల భూమేష్ ఎన్నికయ్యారు.



ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. కార్యకర్తలందరికీ సముచిత గౌరవం కల్పిస్తూ సమన్వయంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ముత్యంగారి గోవర్ధన్, వార్డు సభ్యులు బోడ దాస్ గౌడ్, రమేష్, పెంట్యా, మాజీ ఎంపీటీసీ, పార్టీ సీనియర్ నాయకుడు రామకృష్ణయ్య, చంద్రశేఖర్, పెంటయ్య, మల్లేశం, కిష్టయ్యతో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# షేక్‌పేట్ నాలా, సీబీఐటీ కారిడార్, మణికొండ పైప్‌లైన్ రోడ్డు విస్తరణ. అభివృద్ధికి ఆటంకం కాకుండా ప్రజా సమస్యల ఆచరణాత్మక పరిష్కారాలు కావాలి !





**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 26 అక్టోబర్ 2026**సోమవారం రోజున షేక్‌పేట్ నాలా, సీబీఐటీ కారిడార్, మణికొండ పైప్‌లైన్ రోడ్డు విస్తరణ విషయమై పర్యావరణ హితంగా, ప్రజలకు ఉపయోగపడేలా హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఉపేందర్ రెడ్డిని భారత రాష్ట్ర సమితి నాయకులు కలసి వినతి పత్రం అందజేయడశీ జరిగింది. మార్చి 2026 లో షేక్‌పేట్ నాలా, సీబీఐటీ కారిడార్, మణికొండ పైప్‌లైన్ రోడ్డు విస్తరణ ప్రాజెక్టు కాంట్రాక్టు కేటాయించి నప్పటికి మై హోమ్ అవతార్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ రద్దీ, పరిసర ప్రాంతాల్లోని హైరైజ్ భవనాల్లోకి రానున్న సుమారు 2 లక్షల మంది అదనపు నివాసితుల వల్ల పెరిగే ట్రాఫిక్ భారం, అలాగే ముష్కిన్ చెరువు పరిరక్షణపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మీడియా కథనాల ప్రకారం కొన్ని సమస్యలపై స్థానిక రాజకీయ నాయకులు, నివాసితులు రాజేంద్రనగర్ ఎమ్మెల్యేను కలిసి ఫొటోలు దిగడం ప్రజాసేవకు కొలమానం కాదు, ప్రజా సమస్యల పరిష్కారానికి తోడ్పడాలి, వాస్తవానికి అమలు సంస్థ భూసేకరణతో పాటు ఇతర ప్రక్రియలను కొనసాగిస్తున్న సమయంలో, ప్రాజెక్టు వివరాలను సమగ్రంగా పరిశీలించి ఆచరణ సాధ్యమైన పరిష్కారాలను సూచించడమే ప్రాధాన్యత కావాలి. సమస్యలను మరింత జటిలం చేయడం వల్ల ఆలస్యాలు, అదనపు వ్యయాలు పెరిగే అవకాశం ఉంది. మై హోమ్ అవతార్ జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్ లేదా గ్రేడ్ సెపరేటర్, ఫ్రీ లెఫ్ట్ టర్న్ లు సరైన యూ టర్న్ సమన్వయంతో కూడిన ట్రాఫిక్ సిగ్నళ్లు, ప్రత్యామ్నాయ లింక్ రోడ్ల సాధ్యా సాధ్యాలను పరిశీలించాలి. ముష్కిన్ చెరువు సరిహద్దు విషయమై చట్ట బద్ధమైన బఫర్ జోన్‌కు భంగం కలగకుండా చూడాలి. శాస్త్రీయ డ్రైనేజీ వ్యవస్థలు ఏర్పాటు చేసి, మురుగునీరు చెరువులోకి చేరకుండా చర్యలు తీసుకోవాలి.

## ఇన్ఫోసిస్ ప్రారంభోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

## ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ మను చౌదరి

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం అక్టోబర్ 26:** ఘట్‌కేసర్ మండలం పోచారంలోని ఇన్ఫోసిస్ నూతన భవన ప్రారంభోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. ఈ నెల 30న రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా జరగనున్న ప్రారంభోత్సవ కార్యక్రమం నేపథ్యంలో సోమవారం ఆయన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత శాఖల అధికారులు, ఇన్ఫోసిస్ ప్రతినిధులకు పలు సూచనలు చేశారు.



ముఖ్యమంత్రి హెలికాప్టర్ ద్వారా కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో హెలిప్యాడ్ నిర్మాణం, భద్రతా చర్యలు, ఇతర మౌలిక సదుపాయాలపై కలెక్టర్ సమీక్షించారు. హెలిప్యాడ్ ఏర్పాట్లలో అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని రహదారులు, భవనాల శాఖ అధికారులకు సూచించారు. ప్రారంభోత్సవ కార్యక్రమం, సమావేశ నిర్వహణకు సంబంధించిన వివరాలను ఇన్ఫోసిస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

కార్యక్రమానికి హాజరయ్యే ప్రముఖులు, అతిథుల సంఖ్యకు అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు ఇన్ఫోసిస్ సంస్థకు, సంబంధిత శాఖలకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ పరిశీలనలో కీసర ఆర్డీవో వెంకట్‌రెడ్డి, ఘట్‌కేసర్ తహసీల్దార్ చంద్రశేఖర్, జిల్లా రహదారులు, భవనాల శాఖ ఈఈ జలంధర్, ఇన్ఫోసిస్ ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లోని ఐసీఎఫ్ఏఐ లా స్కూల్‌లో VERDE--2026’ ముగింపు వేడుకలు

**హైదరాబాద్, 25 అక్టోబర్ 2026: (ప్రజాబలం ప్రతినిధి )**ది ఐసీఎఫ్ఏఐ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ (IFHE) ఆధ్వర్యంలోని ఐసీఎఫ్ఏఐ లా స్కూల్‌లో అక్టోబర్ 23 నుంచి 25 వరకు మూడు రోజుల పాటు నిర్వహించిన పర్యావరణ దౌత్య సదస్సు VERDE--2026’ విజయవంతంగా ముగిసింది. లా స్కూల్‌కు చెందిన సాక్షం (SAK-SHAM), గయా (GAIA) క్లబ్‌ల





సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం చివరి రోజున ఎఫ్ఎస్‌టీ (FST) ఆడిటోరియంలో ముగింపు వేడుకలను నిర్వహించారు. సుస్థిర భవిష్యత్తు కోసం అర్థవంతమైన చర్చలు, సమిష్టి సమస్యల పరిష్కారం, యువత ఆధ్వర్యంలోని కార్యాచరణను ప్రోత్సహించడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం.

ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (SDGs) ప్రాతిపదికన చేపట్టిన ఈ సదస్సులో విద్యార్థులు విధాన రూపకర్తలు, దౌత్యవేత్తలు, పర్యావరణ నాయకులు, జర్నలిస్టుల పాత్రలు పోషించారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థల నమూనా సమావేశాల ద్వారా వాతావరణ మార్పులు, జీవవైవిధ్య పరిరక్షణ, కాలుష్య నియంత్రణ అంశాలపై లోతుగా చర్చించి తీర్మానాల ముసాయిదాలను రూపొందించారు. సాధారణ మోడల్ యునైటెడ్ నేషన్స్ (MUN) తరహా కాకుండా, ఇది పూర్తిగా పర్యావరణ పరిపాలన, వాతావరణ చర్యలు (SDG 13), జల-భూ జీవరాశుల రక్షణ (SDG 14, 15), బాధ్యతాయుత వినియోగం (SDG 12), స్వచ్ఛమైన నీరు (SDG 6), స్వచ్ఛమైన ఇంధనం (ాణ+ 7), మరియు భాగస్వామ్యాలు (SDG 17) వంటి అంశాలపైనే ప్రత్యేక దృష్టి సారించింది.

ఈ ముగింపు సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న భారత జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ (NDMA) మాజీ ఉపాధ్యక్షుడు శ్రీ మర్రి శశిధర్ రెడ్డి ప్రసంగిస్తూ, పర్యావరణ సవాళ్లకు భౌగోళిక సరిహద్దులు ఉండవని అన్నారు. వీటి పరిష్కారానికి ప్రభుత్వాలు, సంస్థలు, పౌరులతో పాటు ముఖ్యంగా యువత ముందస్తు సన్నద్ధత, సమాచార ఆధారిత నిర్ణయాలు, సమిష్టి భాగస్వామ్యంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.

ఐసీఎఫ్ఏఐ లా స్కూల్ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ (డా.) విజయేందర్ కుమార్ అధ్యక్షోపన్యాసం చేస్తూ, విద్యార్థులు కేవలం సిద్ధాంతాలకే పరిమితం కాకుండా వాస్తవ ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేలా ఇలాంటి అనుభవాధారిత కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. సుస్థిర సమాజ నిర్మాణానికి విమర్శనాత్మక ఆలోచన, సంభాషణ, పరిష్కార నైపుణ్యాలను అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు.

కార్యక్రమంలో భాగంగా సాక్షం క్లబ్ కోఆర్డినేటర్ శ్రీ సెట్టి హృదయ్ తేజ్ సదస్సు నివేదికను సమర్పించగా, గయా క్లబ్ కోఆర్డినేటర్ శ్రీ డి.వి.ఎన్. మూర్తి ముగింపు వ్యాఖ్యలు చేస్తూ పర్యావరణ బాధ్యతను కొనసాగించాలని కోరారు. అనంతరం అసిస్టెంట్ డీన్ డా. ఎ. అరుణ్ కుమార్ ధన్యవాద సమర్పణ చేశారు. పర్యావరణ దౌత్యం, యువ నాయకత్వాన్ని తీర్చిదిద్దడమే ధ్యేయంగా ఈ ఎజు=ణజు వేదిక నిలిచిందని నిర్వాహకులు స్పష్టం చేశారు.

## ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

## జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



**మేడ్చల్ మల్కాజిగిరి:** ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిబంధనల ప్రకారం పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.

ఈ సందర్భంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, పౌరసరఫరాలు, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 133 దరఖాస్తులు అందినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీదారుల వినతులకు ప్రాధాన్యమివ్వాలని, వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తుపై తీసుకున్న చర్యల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా సంబంధిత శాఖల అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు.

కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గోపాన్ పల్లి లో రామ్ రాజ్ షోరూమ్ ప్రారంభం



రంగా రెడ్డి అక్టోబర్ 26;రంగా రెడ్డి జిల్లా శేరిలింగంపల్లి లోని గోపాన్ పల్లి లో రామ్ రాజ్ షోరూమ్ ఘనంగా ప్రారంభమైంది.ఈ షో రూమ్ ప్రారంభ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ రవీందర్ ముదిరాజ్, చంద్ పాషా , హైదరాబాద్ బీసీ జనరల్ సెక్రెటరీ నరేష్ ముదిరాజ్ పాల్గొనడం జరిగింది ఈకార్యక్రమంలో శ్రీనివాస్ చవధారి వినయ్ కుమార్ మహేష్ పాల్గొనడం జరిగింది.

## ఫీజు పెంపుపై బార్ యజమానుల నిరసన

## జమ్మికుంటలో బార్లు మూసివేసి ఆబ్కారీ సీఐకి వినతి



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 26**బార్ అండ్ రెస్టారెంట్లపై రివిజన్ ఫీజు పెంపును ఉపసంహరించుకోవాలని కోరుతూ జమ్మికుంట పట్టణంలోని బార్ యజమానులు బార్లు మూసివేసి నిరసన తెలిపారు. నిర్వహణ ఖర్చులు, సిబ్బంది వేతనాలు, విద్యుత్ బిల్లులు, అద్దెల పెరుగుదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు కొన్ని వైన్‌షాపులు, బిర్యానీ సెంటర్లలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు, సిట్టింగ్‌లు కొనసాగుతున్నాయన్న ఆరోపణలపై అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు జమ్మికుంట ఆబ్కారీ సీఐకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అభిరామ్, రంగు, ఆర్‌టీ బార్ల యాజమాన్యాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇష్టానుసారంగా కారు పార్కింగ్ చలన్ వేసిన ఏఎస్ఐ
## చాలన్ వేసిన పుల్కల్ ఏఎస్ఐ వెంకటేశం



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 26 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** పుల్కల్ మండల పరిధిలో గల సింగూరు ప్రాజెక్టు వద్ద, నడిరోడ్డుపై ఇష్టానుసారంగా కారు నిలిపిన వ్యక్తికి పుల్కల్ పోలీసులు భారీ జరిమానా విధించారు, నిన్న ఆదివారం కావడంతో సింగూరు ప్రాజెక్టును చూడడానికి, హైదరాబాద్ సంగారెడ్డి మెదక్ తో పాటు, వివిధ జిల్లాల నుండి, పెద్ద ఎత్తున పర్యాటకులు తరలి వచ్చారు, దసరా సెలవులు కావడం, సెలవులు ముగియడంతో, పర్యాటకుల సందడి ఉండడంతో శనివారం ఆదివారం, ప్రాజెక్టు ప్రధాన వ్యాపారుల దుకాణాల వద్ద, పార్కింగ్ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది, ప్రతిరోజు ట్రాఫిక్ జామ్ అవుతుందనె, ముందస్తు సమాచారంతో పుల్కల్ పోలీసులు తనిఖీలు చేపట్టారు, ఈ క్రమంలో ఓ కారు యజమాని, తన కారును ఏకంగా నడిరోడ్డు మీదనే నిలిపి, ఎక్కడికో వెళ్లిపోయారు, రోడ్డు మధ్యలో కారు ఉండడంతో, వచ్చి పోయే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు, దాదాపు గంటపాటు ఎదురుచూసిన, కారు యజమాని రాకపోవడంతో, ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తున్నందుకు గాను, పుల్కల్ ఏఎస్ఐ వెంకటేశం, ఆ కారుకు చాలన్ వేశారు, రోడ్డుపైన ఇష్టానుసారంగా వాహనాలు నిలపడం వల్ల, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, పర్యటకులు క్రమశిక్షణ పాటించాలని, ఏఎస్ఐ వెంకటేశం హెచ్చరించారు, సింగూరు ప్రాజెక్టు వచ్చే పర్యాటకులు, తమ వాహనాలను నిర్దేశించిన పార్కింగ్ స్థలంలోనే తమ వాహనాలను ఉంచాలని ఆయన సూచించారు.

## మారబోయిన రవి యాదవ్ ప్రశ్నతో కదిలిన అధికార యంత్రాంగం::
## బాపు నగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం




**శేర్లింగంపల్లి ( ప్రజాబలం ప్రతినిధి నరేష్) అక్టోబర్ 26** శేరిలింగంపల్లి,బాపు నగర్ ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యపై బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మరబోయిన రవి యాదవ్ స్పందించి, ప్రజల తరఫున అధికారులను ప్రశ్నించ డంతో ఎట్టకేలకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.గత జూలై 2026లో పోచమ్మ ఆలయం నుంచి ఇంటి నంబర్ 7-79/+/1 వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ప్పటికీ, నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభం కాకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఈ సమస్యపై రవి యాదవ్ అధికార యం త్రాంగాన్ని, స్థానిక ఎమ్మెల్యేను ప్రశ్నిస్తూ

ప్రజల ఇబ్బందులను వారి దృష్టికి తీసుకెళ్లారు.ఈ నేపథ్యంలో ఈరోజు సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడం స్థానిక ప్రజల్లో సంతోషం విల్లువిరి సింది.అయితే, పనులు ప్రారంభించడమే కాకుండా,నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ రోడ్డు నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని రవి యాదవ్ కోరుతున్నారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం స్పందిస్తూ,వారి తరఫున అధికారులను ప్రశ్నిస్తూ,సమ స్యల పరిష్కారం కోసం కృషి చేయడమే రవి యాదవ్ లక్ష్యం.ప్రజా సమ స్యలపై ప్రశ్నిస్తాం... పరిష్కారం లభించే వరకు ప్రజల పక్షాన నిలబడతాం.

## సంగారెడ్డి జిల్లా టి.యన్ జి ఓ నూతనంగా ఎన్నికైన సభ్యులు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 26 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహను, సంగారెడ్డి జిల్లా (టి యన్ జి ఓ ) నూతనంగా ఎన్నికైన కార్యవర్గసభ్యులు మర్యాదపూర్వకంగా మంత్రిని కలిశారుఈసందర్భంగా నూతన అధ్యక్షులు మహమ్మద్ జావిద్ అలీ,తన కార్యవర్గ సభ్యులైన అసోసియేట్అధ్యక్షులు,పి.వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, కోశాధికారి కనిశ్రీకాంత్,మహిళాఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి,గార్లను మంత్రి దామోదర్ రాజనర్సింహకు, పరిచయం చేశారు. ఈ సందర్భంగా మంత్రి నూతన కార్యవర్గాన్ని అభినందించారు,ప్రజాప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు, ఎంతోప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రభుత్వ పాలనలో ఉద్యోగులు పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రజా సంక్షేమం,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన గురుతర బాధ్యత ఉద్యోగులకు ఉందన్నారు,మంత్రి దామోదర్ రాజనర్సింహ. నూతనంగా ఎన్నికైన (టి ఎన్ జి ఓ ) కార్యవర్గ సభ్యులు ఉద్యోగులతో సమన్వయం చేసుకుని ప్రజా సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు అయ్యేలా కృషి చేయాలని మంత్రి ఆదేశించారు. ఉద్యోగులు సమన్వయం చేసుకొని సంగారెడ్డి జిల్లాను ప్రగతి పథంలో తీసుకువెళ్లాలని మంత్రి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో (టీఎన్ జీవో ) పట్టణ శాఖ అధ్యక్షులు యాదవ రెడ్డి, కార్యదర్శి వెంకట్, కార్యవర్గ సభ్యులువెంకటేశం,నాగేశ్వరరావు,రామప్ప,కిరణ్, గౌస్ హాష్మి, నవాజ్, రమేష్, మోహనప్ప, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షులు షరీఫ్, ఇంకా తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.



# మహర్షి వాల్మీకి ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి.

### ఐడిఓసీ లో ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు.
### జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు.

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 26 కలెక్టరేట్**మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనాతో కలిసి జిల్లా కలెక్టర్ వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రామాయణ మహాకావ్యం ద్వారా సత్యం, ధర్మం, మానవీయ విలువలను చాటిన మహనీయుడు వాల్మీకి అని పేర్కొన్నారు. ఆదికవిగా భారతీయ సాహిత్యంలో విశిష్ట స్థానం పొందారని తెలిపారు.



రామాయణంలో వివరించిన కుటుంబ బంధాలు, బాధ్యతలు, నైతిక విలువలు నేటి సమాజానికి మార్గదర్శకమని అన్నారు. యువత మహనీయుల జీవితాలను అధ్యయనం చేసి, వారి ఆదర్శాలను ఆచరణలో పెట్టాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్. మహేందర్ జి, సంపత్ రావు, జిల్లా రెవెన్యూ అధికారి రవి కుమార్, జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి రామ్మోహన్, వాల్మీకి కుల సంఘం సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి.
## జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు.

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 26 కలెక్టరేట్**సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.





ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా, అవసరమైన చోట క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తుపై తీసుకున్న చర్యలను సంబంధిత దరఖాస్తుదారులకు తెలియజేయాలని ఆదేశించారు.ఈ ప్రజావాణిలో మొత్తం 28 దరఖాస్తులు అందాయి. వీటిలో భూ సమస్యలకు సంబంధించి 9, ఇందిరమ్మ ఇళ్లకు 2, పింఛన్లకు 3, ఇతర సమస్యలకు సంబంధించి 14 దరఖాస్తులు ఉన్నాయి.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, సంపత్ రావు, జిల్లా రెవెన్యూ అధికారి రవి కుమార్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా 'యాంటీ డ్రగ్స్ & సైబర్ సెక్యూరిటీ' అంశాలపై వ్యాసరచన పోటీలు:




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 26 ఏటూరునాగారం** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీస్ అమరవీరుల వారోత్సవాలు పురస్కరించుకుని విద్యార్థుల్లో సామాజిక చైతన్యం, అవగాహన పెంపొందించే లక్ష్యంతో 'యాంటీ డ్రగ్స్ (మత్తు పదార్థాల నిర్మూలన)' మరియు 'సైబర్ సెక్యూరిటీ (డిజిటల్ భద్రత)' అనే అంశాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి రేణుక తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ బి రేణుక మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో విద్యార్థులు సైబర్ నేరాలు మరియు డ్రగ్స్ బారిన పడకుండా ఉండేందుకు విస్తృతమైన అవగాహన అవసరమని పేర్కొన్నారు. దేశ రక్షణలో, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉద్ఘాటించారు

.ఈ కార్యక్రమం లో ఎన్ ఎస్ ఎస్ కో-ఆర్డినేటర్ సిహెచ్. వెంకటయ్య, కెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ డాక్టర్ నవీన్, ఐ క్యు ఎ సి కో-ఆర్డినేటర్ డాక్టర్ పి. జ్యోతి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ కనీస్ ఫాతిమా, అధ్యాపకులు జీవవేణి, శ్రీధర్, రమేష్, శ్రీకాంత్, రాజశేఖర్ లతో పాటు ఇతర అధ్యాపక బృందం, నాన్-టీచింగ్ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.






Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com